RNI No: TELTEL/2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | గురువారం | పేజీలు 8
సంపుటి: 4 సంచిక:74 | ఫిబ్రవరి 26, 2026 | వెల: రూ.3-00

గ్లోబల్ మ్యానుఫ్యాక్చరింగ్, ఏఐపై

## ముఖ్యమంత్రి సమీక్ష



- యువతకు స్కిల్లింగ్, రీస్కిల్లింగ్‌పై దృష్టి
- శంతను నారాయణ్‌తో ఉన్నత స్థాయి భేటీ
- తెలంగాణ రైజింగ్-2047 విజన్ దిశగా చర్చ

2లో

ఆర్టీవో అధికారులమంటూ..

## వెంట్రుకల లోడుతో పరార్

సొత్తు విలువ సుమారు రూ.20 లక్షలు

- తంగళ్లపల్లిలో సినీ ఫక్కీలో చోరీ
- కేసును ఛేదించిన పోలీసులు.. నిందితుల అరెస్ట్

2లో



యూట్యూబర్

## కోమలి ఆత్మహత్య

- మణికొండలో విషాదం
- బ్రేకప్ అనంతరం మళ్లీ కలిసిన మాజీ స్నేహితుడు
- మనస్తాపంతోనే నిర్ణయం



2లో

## వచ్చీరాని వైద్యం..

# ప్రాణాలతో చెలగాటం!

## ఆర్ఎంపీల ఇష్టారాజ్యం!

ఒకప్పుడు నిస్వార్థ సేవ.. నేడు కాసుల వేట


పరిమితికి మించి హైడోస్ మందులు.. అవసరం లేకున్నా ప్రైవేట్ ఆస్పత్రులకు రిఫర్

- బిల్లులో యాభై శాతం వారి జేబుల్లోకి..
- టెస్టులు చేయించుకున్నా.. మందులు కొన్నా కమీషనే
- పేదల రక్తాన్ని జలగల్లా పీలుస్తున్న వైనం
- ఆర్ఎంపీలను ప్రోత్సహిస్తున్న కొన్ని కార్పొరేట్ ఆస్పత్రులు
- పట్టించుకోని వైద్యఆరోగ్యశాఖ అధికారులు

వేద న్యూస్, ఫోకస్ టీమ్

**ఒకప్పుడు పల్లెటూళ్లలో** వైద్యుడు అందుబాటులో లేని సమయంలో ఆర్ఎంపీలే ప్రజలకు దిక్కు. అత్యవసర పరిస్థితుల్లో ప్రథమ చికిత్స అందించి ప్రాణాలు కాపాడి, ప్రజల మనసుల్లో దైవ సమానులుగా నిలిచారు. కానీ, కాలక్రమేణా ఆ సేవా దృక్పథం కనుమరుగై, వైద్యం ఇప్పుడు భారీ వ్యాపారంగా మారిపోయింది. నేడు గ్రామాల్లో కొందరు ఆర్ఎంపీలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ, వచ్చీరాని వైద్యంతో అమాయక ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. నిబంధనల ప్రకారం కేవలం ప్రథమ చికిత్సకు మాత్రమే పరిమితం కావాల్సిన ఆర్ఎంపీలు, డిగ్రీలు లేకపోయినా హై డోస్ యాంటీబయోటిక్స్, స్టెరాయిడ్లు విచ్చలవిడిగా వాడుతూ రోగుల శరీరాలను అనారోగ్యాల పాలు చేస్తున్నారు. వారి అసలు దందా మాత్రం ప్రైవేట్ ఆస్పత్రులు, డయాగ్నస్టిక్ సెంటర్లతో సాగుతోంది. గ్రామాల్లో ఎవరికి ఏ చిన్న సమస్య వచ్చినా, తమకు భారీ కమిషన్లు ఇచ్చే పట్టణాల్లోని ఆస్పత్రులకే రిఫర్ చేస్తున్నారు. ఒక రోగిని తీసుకెళ్లినందుకు ఆస్పత్రి బిల్లులో ఏకంగా 40 నుంచి 50 శాతం వరకు కమిషన్ దండుకుంటూ పేదల రక్తాన్ని జలగల్లా పీలుస్తున్నారు. ఈ అడ్డగోలు వైద్యంపై వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు ఫిర్యాదులు అందుతున్నా, చర్యలు మాత్రం శూన్యం. తనిఖీలు నిర్వహించి ఇటువంటి క్లినిక్‌లను సీజ్ చేయాల్సిన అధికారులు, మామూళ్ల మత్తులో జోగుతున్నారనే ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి.

2లో




## అన్వేష్‌పై లుకౌట్ నోటీసులు

యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్‌లకు పంజాగుట్ట పోలీసుల లేఖ

- హిందూ దేవుళ్లపై అసభ్యకర వ్యాఖ్యల ఆరోపణలే కారణం
- కరాటే కళ్యాణి ఫిర్యాదుతో కేసు నమోదు
- ఇప్పటికే ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ బ్లాక్
- సోషల్ మీడియాలో ఫాలోవర్ల అన్‌ఫాలో ఉద్యమం
- పలు కేసులతో వివాదాల్లో ప్రపంచ యాత్రికుడు



2లో

రెవెన్యూ కార్యాలయాలకు

## శాశ్వత భవనాలు

అద్దె భవనాలకు ఇక చెక్

- తొలి దశలో 65 కార్యాలయాల నిర్మాణం
- ప్రజలకు సేవే ప్రభుత్వ లక్ష్యం: పొంగులేటి

2లో





### సోనియా గాంధీకి భట్టి కుమారుడి వివాహ ఆహ్వానం

- హైదరాబాద్‌లో జరగనున్న సూర్య విక్రమాధిత్య పెండ్లి
- ఆశీస్సులు అందించిన కాంగ్రెస్ నాయకత్వం

2లో

## హంతకులను వెంటనే అరెస్ట్ చేయాలి

- బాధిత కుటుంబానికి అండగా ఉంటాం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- చిన్నారి కుటుంబానికి పరామర్శ
- పది లక్షలతో ఇల్లు నిర్మాణం.. తక్షణ సహాయంగా లక్ష రూపాయలు

2లో



వేద న్యూస్

గురువారం | ఫిబ్రవరి 26, 2026

# యూట్యూబర్ కోమలి ఆత్మహత్య

- మణికొండలో విషాదం
- బ్రేకప్ అనంతరం మళ్లీ కలిసిన మాజీ స్నేహితుడు
- మనస్తాపంతోనే నిర్ణయం

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**

మణికొండలోని చిత్రపురి కాలనీలో నివసిస్తున్న యూట్యూబర్ కోమలి ఆత్మహత్య చేసుకున్న ఘటన స్థానికంగా కలకలం రేపింది. వ్యక్తిగత కారణాలతో తీవ్ర మనస్తాపానికి గురై ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రాథమిక సమాచారం. సమాచారం ప్రకారం, కోమలి మాజీ స్నేహితుడు అఖిల్ రెడ్డి ఆత్మహత్యకు ముందు ఆమె ఇంటికి వెళ్లినట్లు తెలిసింది. ఏడాది క్రితం ఇద్దరూ విడిపోయినప్పటికీ, అతడిని వదిలి ఉండలేక కోమలి తిరిగి సంప్రదించి ఇంటికి పిలిచినట్లు సమాచారం. తనతో కలిసి ఉండాలని కోరగా, అఖిల్ నిరాకరించి వెళ్లిపోయినట్లు చెబుతున్నారు. ఈ ఘటన తర్వాత కోమలి తీవ్ర నిరాశకు లోనై ఆత్మహత్య చేసుకున్నట్లు అనుమానం వ్యక్తమవుతోంది. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. వ్యక్తిగత సమస్యలు జీవితాన్ని ముగించుకునే స్థాయికి తీసుకెళ్లకూడదని నిపుణులు సూచిస్తున్నారు. కుటుంబ సభ్యులు, స్నేహితులతో మాట్లాడటం, అవసరమైతే నిపుణుల సహాయం పొందడం ద్వారా సమస్యలకు పరిష్కారం వెతకాలని సూచిస్తున్నారు. పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# పసికందు హంతకులను వెంటనే అరెస్ట్ చేయాలి

- బాధిత కుటుంబానికి అండగా ఉంటాం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- చిన్నారి కుటుంబానికి పరామర్శ
- పది లక్షలతో ఇల్లు నిర్మాణం.. తక్షణ సహాయంగా లక్ష రూపాయలు

**వేద న్యూస్, నాగర్‌కర్నూల్**

నాగర్‌కర్నూల్ జిల్లా కుమ్మెర మల్లన్న జాతరలో జరిగిన దారుణ ఘటనలో మృతి చెందిన రెండు నెలల పసిపాప కుటుంబాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు పరామర్శించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చిన ఆయన, పది లక్షల రూపాయలతో ఇల్లు కట్టిస్తామని ప్రకటించారు. తక్షణ సహాయంగా లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆ కుటుంబానికి న్యాయం చేయాలని ఆందోళన చేస్తున్న వివిధ వర్గాల నాయకులు, కార్యకర్తలను కలిసి సంఘీభావం తెలిపారు. కుమ్మెరలో జరిగిన ఈ ఘటన తెలంగాణ సమాజం మొత్తం తలదించుకునేలా చేసిందని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. పసిపాప హంతకులకు అండగా నిలబడే ప్రతి ఒక్కరూ దోషులేనని ఆయన తీవ్రంగా విమర్శించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అయినా, స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ ఎవరైనా సరే హంతకులకు మద్దతు ఇవ్వడం పూర్తిగా తప్పని కేటీఆర్ అన్నారు. హంతకుడు ఎవరైనా, ఏ పార్టీకి చెందిన వారైనా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుని జైల్లో పెట్టాలని డిమాండ్ చేశారు. దాడికి పాల్పడిన ఎనిమిది మందిపై హత్యానేరం కింద కేసులు నమోదు చేసి వెంటనే అరెస్ట్ చేయాలని కోరారు. బాధిత కుటుంబానికి కోటి రూపాయల నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. పసిపాపను హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించి జైల్లో వేయాలని, అవసరమైతే ఉరిశిక్ష విధించాలని కేటీఆర్ స్పష్టం చేశారు.

# రెవెన్యూ కార్యాలయాలకు శాశ్వత భవనాలు

- అద్దె భవనాలకు ఇక చెక్
- తొలి దశలో 65 కార్యాలయాల నిర్మాణం
- ప్రజలకు సేవే ప్రభుత్వ లక్ష్యం: మంత్రి పొంగులేటి

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**




రాష్ట్రవ్యాప్తంగా తహసీల్దార్, ఉప విభాగాధికారి కార్యాలయాలకు శాశ్వత భవనాలు నిర్మించాలని ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించి ఈ విషయాన్ని వెల్లడించారు. ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగడం సరికాదని, ప్రజలకు సేవలందించే కేంద్రాలు గౌరవప్రదంగా ఉండాలనే దృష్టితో ఈ నిర్ణయం తీసుకున్నామని మంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకత్వంలో రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ కార్యాలయాల నిర్మాణానికి కార్యాచరణ రూపొందించామని చెప్పారు. మొదటి దశలో ప్రస్తుతం అద్దె భవనాల్లో నడుస్తున్న 60 తహసీల్దార్ కార్యాలయాలు, 5 ఉప విభాగాధికారి కార్యాలయాలకు సకల వసతులతో కూడిన శాశ్వత భవనాలు నిర్మించాలని నిర్ణయించారు. రెండో దశలో శిథిలావస్థలో ఉన్న 170 కార్యాలయాలను పునర్నిర్మించాలని నిర్ణయించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని కార్యాలయాలు ఒకే నమూనాలో, ప్రజలకు సులభంగా చేరుకునే విధంగా రూపకల్పన చేయాలని చర్చించారు. స్టాంపులు మరియు నమోదు శాఖలో ఆధునిక వసతులతో సమీకృత భవనాల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని మంత్రి తెలిపారు. గచ్చిబౌలి, మేడ్చల్, పఠాన్ చెరువు ప్రాంతాల్లో నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని, గచ్చిబౌలి భవనం తుది దశలో ఉందని వెల్లడించారు. గత ప్రభుత్వం సరైన ప్రణాళిక లేకుండా మండలాలు విభజించడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని, కొత్త మండలాలకు అవసరమైన సిబ్బందిని కేటాయించి సేవలను బలోపేతం చేస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు. తక్కువ ఖర్చుతో వేగవంతమైన, పారదర్శక సేవలు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.

## వచ్చీరాని వైద్యం..

# ప్రాణాలతో చెలగాటం!

**వేద న్యూస్, ప్రత్యేక ప్రతినిధి**




ఒకప్పుడు గ్రామాల్లో వైద్యుడు అందుబాటులో లేని సమయంలో ఆర్ఎంపీలే దిక్కయ్యేవారు. అత్యవసర సమయంలో ప్రథమ చికిత్స అందించి ప్రాణాలు కాపాడే వారిని ప్రజలు దైవ సమానులుగా భావించేవారు. కానీ కాలక్రమేణా ఆ పరిస్థితి మారిపోయింది. సేవా దృక్పథం పోయి వ్యాపార ధోరణి పెరిగింది. నేడు పల్లెల్లో కొందరు ఆర్ఎంపీలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ, వచ్చీరాని వైద్యంతో అమాయక ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు.

**పరిమితికి మించి వైద్యం..**

నిబంధనల ప్రకారం ఆర్ఎంపీలు కేవలం ప్రథమ చికిత్స మాత్రమే అందించాలి. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉంది. డిగ్రీలు లేకపోయినా, అనుభవం అంతగా లేకపోయినా.. హై డోస్ యాంటీబయోటిక్స్ వాడటం, స్టెరాయిడ్లు ఇవ్వడం, గ్లూకోజ్ బాటిళ్లు ఎక్కించడం వంటి పనులు చేస్తున్నారు. జ్వరం, దగ్గు అని వెళ్తే చాలు.. కారణం తెలుసుకోకుండానే విచ్చలవిడిగా ఇంజక్షన్లు గుచ్చుతున్నారు. ఈ అడ్డగోలు వైద్యం వల్ల చాలా మందిలో కిడ్నీలు దెబ్బతినడం, రియాక్షన్లు రావడం వంటి సమస్యలు తలెత్తుతున్నాయి. అత్యవసర పరిస్థితిలో పేషెంట్‌ను పెద్ద ఆస్పత్రికి తరలించాల్సిన సమయంలోనూ వచ్చీరాని వైద్యం చేసి ప్రాణాల మీదకు తెస్తున్నారు.

**ప్రైవేట్ ఆస్పత్రులతో 'కమిషన్' బంధం**

ఆర్ఎంపీల అసలు దందా ప్రైవేట్ ఆస్పత్రులతో సాగుతోంది. గ్రామాల్లో ఎవరికైనా చిన్న ఆపరేషన్ లేదా సీరియస్ సమస్య ఉందంటే చాలు.. తమకు కమిషన్ ఇచ్చే పట్టణాల్లోని ప్రైవేట్ ఆస్పత్రులకే పేషెంట్లను రిఫర్ చేస్తున్నారు. ఇలా పేషెంట్‌ను తీసుకెళ్లినందుకు ఆస్పత్రి యాజమాన్యం నుంచి ఆర్ఎంపీకి 40శాతం నుండి 50 శాతం వరకు కమిషన్ అందుతోంది. ఈ కమిషన్ల కోసమే అవసరం లేకపోయినా పేషెంట్లను భయపెట్టి కార్పొరేట్ ఆస్పత్రులకు తరలిస్తున్నారు. ఆస్పత్రుల యాజమాన్యాలు సైతం ఆర్ఎంపీలు తీసుకొచ్చిన కేసులకే మొదటి ప్రియార్టీ ఇస్తున్నారు.

**టెస్టుల పేరిట దోపిడీ..**

కేవలం హాస్పిటల్ అడ్మిషన్లే కాకుండా, డయాగ్నస్టిక్ సెంటర్లతోనూ వీరికి లోపాయికారి ఒప్పందాలు ఉన్నాయి. సాధారణ జ్వరం వచ్చినా వేల రూపాయల విలువ చేసే రక్త పరీక్షలు, స్కానింగ్‌లు చేయిస్తున్నారు. ప్రతి టెస్టులోనూ ఆర్ఎంపీకి నిర్దేశిత శాతం కమీషన్ అందుతుంది. అమాయక ప్రజల నమ్మకాన్ని వీరు పెట్టుబడిగా మార్చుకుంటున్నారు. కొన్నిచోట్ల మందుల షాపుల నుంచి కూడా వీరికి కమీషన్లు అందుతుండటం గమనార్హం.

**ఆస్పత్రులకు వీరిపైనే నమ్మకం**

పట్టణాల్లోని చాలా ప్రైవేట్ ఆస్పత్రులు కేవలం ఈ ఆర్ఎంపీలు తెచ్చే పేషెంట్ల మీదే నడుస్తున్నాయి. దీంతో ఆస్పత్రిలో డాక్టర్ కంటే ఈ మధ్యవర్తిగా ఉండే ఆర్ఎంపీ మాటే వేదంగా మారుతోంది. పేషెంట్ బంధువులకు బిల్లు విషయం అర్థం కాకుండా చేయడం, ఆస్పత్రి యాజమాన్యంతో మాట్లాడి బిల్లులు పెంచడం వంటివి వీరి కనుసన్నల్లోనే జరుగుతున్నాయి. ఫలితంగా పేద కుటుంబాలు అప్పుల పాలై వీధిన పడుతున్నాయి.

**నిమ్మకు నీరెత్తినట్లు అధికారులు**

గ్రామాల్లో సాగుతున్న ఈ అక్రమ వైద్యంపై వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు ఫిర్యాదులు అందుతున్నా చర్యలు మాత్రం శూన్యం. తనిఖీలు నిర్వహించి అడ్డగోలు వైద్యం చేసే క్లినిక్‌లను సీజ్ చేయాల్సిన అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆర్ఎంపీల పరిధిని నిర్దేశించి, కమీషన్ల దందా చేస్తున్న ఆస్పత్రులపై ఉక్కుపాదం మోపాలని బాధితులు కోరుతున్నారు.

## ఆర్ఎంపీల ఇష్టారాజ్యం!

**ఒకప్పుడు నిస్వార్థ సేవ.. నేడు కాసుల వేట**

- పరిమితికి మించి హైడోస్ మందులు..
- అవసరం లేకున్నా ప్రైవేట్ ఆస్పత్రులకు రిఫర్
- బిల్లులో యాభై శాతం వారి జేబుల్లోకి..
- టెస్టులు చేయించుకున్నా.. మందులు కొన్నా కమీషనే
- పేదల రక్తాన్ని జలగల్లా పీలుస్తున్న వైనం
- ఆర్ఎంపీలను ప్రోత్సహిస్తున్న కొన్ని కార్పొరేట్ ఆస్పత్రులు
- పట్టించుకోని వైద్యఆరోగ్యశాఖ అధికారులు

## గ్లోబల్ మాన్యుఫ్యాక్చరింగ్, ఏఐపై

# ముఖ్యమంత్రి సమీక్ష

- యువతకు స్కిల్లింగ్, రీస్కిల్లింగ్‌పై దృష్టి
- శంతను నారాయణ్‌తో ఉన్నత స్థాయి భేటీ
- తెలంగాణ రైజింగ్-2047 విజన్ దిశగా చర్చ

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**



గ్లోబల్ మాన్యుఫ్యాక్చరింగ్, గ్రీన్ ఎనర్జీ, ఏఐ ప్రభావం, యువతకు స్కిల్లింగ్–రీస్కిల్లింగ్ వంటి కీలక అంశాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. అడోబ్ సంస్థ ప్రధాన కార్యనిర్వాహక అధికారి, తెలంగాణ రైజింగ్–2047 విజన్ బోర్డు సభ్యుడు శంతను నారాయణ్ హైదరాబాద్‌లో ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రపంచవ్యాప్తంగా మాన్యుఫ్యాక్చరింగ్ రంగంలో జరుగుతున్న మార్పులు, గ్రీన్ ఎనర్జీ వైపు దేశాలు తీసుకుంటున్న అడుగులు, ఏఐ విప్లవం ఆర్థిక వ్యవస్థపై చూపిస్తున్న ప్రభావం వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. తెలంగాణ ప్రభుత్వం ముందుచూపుతో తీసుకోవాల్సిన విధాన నిర్ణయాలపై సమావేశంలో సమగ్ర సమీక్ష జరిగింది. తెలంగాణను శక్తివంతమైన తయారీ కేంద్రంగా తీర్చిదిద్దేందుకు సమగ్ర ప్రణాళికలు అవసరమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ప్రముఖ అంతర్జాతీయ సంస్థలను రాష్ట్రానికి ఆకర్షించేందుకు విధానాలు, మౌలిక వసతులు, ఆవిష్కరణ వాతావరణం సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సుస్థిర పారిశ్రామిక వృద్ధి దిశగా వ్యూహాత్మక చర్యలు అవసరమని అభిప్రాయపడ్డారు. ఏఐలో వస్తున్న విప్లవాత్మక మార్పులు ఉద్యోగావకాశాల స్వరూపాన్ని మార్చుతున్న నేపథ్యంలో యువతను భవిష్యత్ అవసరాలకు సిద్ధం చేయడం అత్యవసరమని ముఖ్యమంత్రి అన్నారు. స్కిల్లింగ్, రీస్కిల్లింగ్ కార్యక్రమాలను బలోపేతం చేసి సమగ్ర అభివృద్ధి సాధించాలని సూచించారు. తెలంగాణ అభివృద్ధి యాత్రను వేగవంతం చేసేందుకు సాంకేతిక, తయారీ, గ్రీన్ ఎనర్జీ రంగాల్లో మరింత సహకారం అందించాలని శంతను నారాయణ్‌ను ముఖ్యమంత్రి కోరారు.

# భట్టి కుమారుడి వివాహ ఆహ్వానం

**వేద న్యూస్, హైదరాబాద్**



రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు యూపీఏ చైర్‌పర్సన్ సోనియా గాంధీ, దేశ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని మర్యాదపూర్వకంగా కలిశారు. వచ్చే నెల 5వ తేదీన హైదరాబాద్‌లో జరగనున్న తన కుమారుడు సూర్య విక్రమాదిత్య వివాహ వేడుకకు విచ్చేసి నూతన వధూవరులను ఆశీర్వదించాలని ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా సోనియా గాంధీ, రాహుల్ గాంధీ ఆహ్వానాన్ని సాదరంగా స్వీకరించినట్లు భట్టి విక్రమార్క తెలిపారు. తమ కుటుంబ వేడుకకు ఆశీస్సులు అందించడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో జరగనున్న ఈ వివాహ వేడుకకు పలువురు జాతీయ, రాష్ట్ర స్థాయి ప్రముఖులు హాజరయ్యే అవకాశం ఉందని సమాచారం. కుటుంబ సభ్యులతో కలిసి వివాహ ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిపారు. కాంగ్రెస్ నాయకత్వంతో జరిగిన ఈ భేటీ మర్యాదపూర్వకంగా, ఆత్మీయ వాతావరణంలో సాగినట్లు తెలిసింది.

# యూట్యూబర్ అన్వేష్‌పై లుకౌట్ నోటీసులు

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**



ప్రపంచ దేశాలు తిరుగుతూ అక్కడి విశేషాలను సోషల్ మీడియా వేదికగా పంచుకుంటూ ఫేమస్ అయిన నా అన్వేషణ అన్వేష్‌పై హైదరాబాద్ పంజాగుట్ట పోలీసులు లుకౌట్ నోటీసులు జారీ చేశారు. హిందూ దేవుళ్లపై అసభ్యకరమైన వ్యాఖ్యలు చేశారంటూ పలువురు ఫిర్యాదు చేయడంతో ఈ చర్యలు తీసుకున్నట్టు సమాచారం. గత ఏడాది కరాటే కళ్యాణి చేసిన ఫిర్యాదుతో అన్వేష్‌పై కేసు నమోదైంది. అదే కేసులో భాగంగా తాజాగా లుకౌట్ నోటీసులు జారీ చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ఇప్పటికే అన్వేష్ ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ బ్లాక్ కాగా, యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్ సంస్థలకు కూడా అధికారిక లేఖలు రాయనున్నట్లు తెలుస్తోంది. దీంతో అతని సోషల్ మీడియా ఖాతాలు పూర్తిగా నిలిపివేయబడే అవకాశముందని చర్చ సాగుతోంది. మహిళల వస్త్రధారణ వివాదంపై స్పందించిన సందర్భంలో అన్వేష్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. ముఖ్యంగా హిందూ దేవీ దేవుళ్లపై, భారతదేశంపై చేసిన వ్యాఖ్యలు పెద్ద ఎత్తున విమర్శలకు దారి తీశాయి. ఈ నేపథ్యంలో అతడిపై పలు ప్రాంతాల్లో కేసులు నమోదు అయ్యాయి. ఒకప్పుడు అతడి విన్యాసాలు, సాహసాలకు మంత్రముగ్ధులైన అనేక మంది నెటిజన్లు ప్రస్తుతం అన్‌ఫాలో, అన్‌సబ్‌స్క్రైబ్ చేస్తుండటం గమనార్హం. సోషల్ మీడియాలో కొనసాగుతున్న ఈ వివాదం మరింత ముదురే సూచనలు కనిపిస్తున్నాయి.

## ఆర్టీవో అధికారులమంటూ..

# వెంట్రుకల లోడుతో పరార్

**సొత్తు విలువ సుమారు రూ.20 లక్షలు**

- తంగళ్లపల్లిలో సినీ ఫక్కీలో చోరీ
- కేసును ఛేదించిన పోలీసులు.. నిందితుల అరెస్ట్



**వేద న్యూస్, తంగళ్ళపల్లి**

తంగళ్లపల్లి మండలంలో సినీ ఫక్కీలో జరిగిన చోరీ కేసును పోలీసులు ఛేదించారు. ఆర్టీవో అధికారులమని నమ్మించి సుమారు రూ.20 లక్షల విలువైన తల వెంట్రుకల లోడుతో పాటు వాహనాన్ని అపహరించిన అంతర్‌జిల్లా దొంగల ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. సిరిసిల్ల గ్రామీణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె. మొగిలి తెలిపిన వివరాల ప్రకారం, జగిత్యాల జిల్లా రాజేంద్రనగర్ కాలనీకి చెందిన అబ్బనవేని చిన్న ఎల్లయ్య తల వెంట్రుకల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 10న ఆయన సుమారు 8 క్వింటాళ్ల తల వెంట్రుకలను బొలెరో పికప్ వాహనంలో లోడ్ చేసి జగిత్యాల నుంచి హైదరాబాద్ కు బయలుదేరాడు. మార్గమధ్యలో తంగళ్ళపల్లి మండలం పద్మనగర్ పెట్రోలు బంక్ సమీపంలో ఉదయం సుమారు 5:40 గంటల సమయంలో కొందరు వ్యక్తులు తమను ఆర్టీవో అధికారులమని పరిచయం చేసుకుని వాహనాన్ని ఆపారు. తనిఖీ చేస్తున్నట్లు నటించి, వెంట్రుకల లోడుతో పాటు వాహనాన్ని తీసుకుని పరారయ్యారు. బాధితుడి ఫిర్యాదు మేరకు తంగళ్ళపల్లి ఉపనిరీక్షకుడు ఉపేంద్ర చారి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి సాంకేతిక ఆధారాల సహాయంతో నిందితులను గుర్తించారు. ఖమ్మం జిల్లాలో గాలింపు చర్యలు చేపట్టి ఐదుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. అరెస్టయిన నిందితులు బొజ్జ కృష్ణయ్య అలియాస్ శివ (హైదరాబాద్), అంగులూరి యస్ పాల్ అలియాస్ బబ్లు (ఖమ్మం), ఎండ్రాతి ఉపేందర్ (ఖమ్మం), తీల్ పితియా సన్నీ డాల్ సింగ్ (ఖమ్మం), రెవిని క్రాంతి (ఖమ్మం)గా పోలీసులు తెలిపారు. విచారణలో నిందితులు నేరాన్ని అంగీకరించడంతో పాటు, మరో ఇద్దరు కూడా ఈ నేరంలో పాల్గొన్నట్లు వెల్లడైంది. నిందితులను సిరిసిల్ల న్యాయస్థానంలో హాజరుపరచగా, న్యాయమూర్తి న్యాయ పరిరక్షణ విధించారు. అనంతరం వారిని కరీంనగర్ జైలుకు తరలించారు. ఈ కేసును వేగంగా ఛేదించి నిందితులను అరెస్ట్ చేసిన ఉపనిరీక్షకుడు ఉపేంద్ర చారి, కానిస్టేబుళ్లు సంపత్, శ్రావణ్, శ్రీనివాస్‌లను సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె. మొగిలి ప్రత్యేకంగా అభినందించారు.

# జనసేవలో తొలి అడుగు

- సేవావాదికి పీపుల్ అండ
- ప్రజాప్రతినిధిగా ప్రజల్లోకి..
- నమ్మకాన్ని నిలబెట్టుకుంటా: ఫెరోజ్



**వేద న్యూస్, జమ్మికుంట:**

సేవావాదికి అండగా నిలిచి జనం.. అతడిని ప్రజాప్రతినిధిగా గెలిపించారు.హోరాహోరీగా సాగిన మున్సిపల్ పోరులో ప్రజల మద్దతుతో సునాయసంగా మున్సిపల్ కౌన్సిలర్‌గా ఆయన నెగ్గారు. అతనే జమ్మికుంట మున్సిపల్ 7వ వార్డు కౌన్సిలర్ ఫెరోజ్ ఎంఏ.

**పక్కా లోకల్..**

జమ్మికుంటలో పుట్టి పెరిగిన ఫెరోజ్ స్కూలింగ్ కేరళ స్కూల్‌లో పూర్తయింది. ఇంటర్ ట్రినిటి జూనియర్ కాలేజీలో, బీటెక్ వరంగల్‌లో, ఎంటెక్ కరీంనగర్‌లో చదివారు. మధ్యతరగతి వ్యవసాయ కుటుంబానికి చెందిన ఫెరోజ్‌కు శ్రమ, కష్టం విలువ తెలుసు. ఫెరోజ్ తండ్రికి గతంలో ఫర్టిలైజర్ షాప్ ఉండేది. చిన్ననాటనే సేవాభావాన్ని అలవర్చుకున్న ఫెరోజ్ నలుగురికి సేవ చేసి.. అండగా నిలవాలని బలంగా భావించారు. ఈ క్రమంలోనే 2020లో కౌన్సిలర్‌గా పోటీ చేసి ఓడిపోయారు. అయినా ప్రజల్లోనే ఉండే ప్రయత్నం చేశారు. కరోనా కష్టకాలంలో వార్డు ప్రజలకు నిత్యావసర సరుకులు, మందులు అందజేశారు. వారి ఆదరాభిమానాలను చూరగొనే ప్రయత్నం చేశారు. వార్డులోని సైడ్ కాలువలు, బోర్ మోటార్లు రిపేర్లు చేపించడం, ప్రజలకు రేషన్ కార్డులు,పెన్షన్లు దగ్గరుండి దరఖాస్తు చేయించడం వంటి పనులను ఎప్పటికప్పుడు చేయించారు. గత 6 నెలల నుంచి ప్రతి నెలా వృద్ధులకు, భర్త లేని మహిళలకు నిత్యావసర సరుకులను తన సొంత నిధులతో ఫెరోజ్ అందజేస్తున్నారు. ఈ క్రమంలోనే తాజాగా జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో 7 వ వార్డు ప్రజలు సేవావాదిగా తమ మధ్యే ఉంటున్న ఫెరోజ్‌కు అండగా నిలిచి.. అతడిని మున్సిపల్ కౌన్సిలర్‌గా ఎన్నుకున్నారు. కాగా, తను కౌన్సిలర్‌గా ఇప్పుడు మరింత బాధ్యతతో ప్రజలకు సేవలందిస్తానని వెల్లడించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేరుస్తానని, 7వ వార్డు సర్వతోముఖాభివృద్ధికి పాటు పడతానని స్పష్టం చేశారు. వార్డు పరిధిలోని శానిటేషన్ పనులను కౌన్సిలర్ ఫెరోజ్ దగ్గరుండి బుధవారం చేయించారు.

# విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



వేద న్యూస్, పాపన్నపేట:

మండలంలోని చికోడ్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తమ తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఐదవ తరగతి విద్యార్థులు వివిధ బాధ్యతలు చేపట్టి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. దీక్షిత డీఈఓగా, మోక్షిత్ చారి ఎంఈఓగా, ఎం. మోక్షిత ప్రధానోపాధ్యాయురాలిగా, రిషిత, నిహారిక, స్పందన, నందిని, భరత్, స్వాత్విక్ తేజ, సాయి తేజ, శివకుమార్, యశ్వంత్, మహేష్, రవీందర్, అఖిల్, మహేశ్వరి, లాస్య ప్రియ ఉపాధ్యాయులుగా, సాత్విక్ పీఈటీగా విధులు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ప్రధానోపాధ్యాయులు టి. కృష్ణ, ఉపాధ్యాయులు యు. ఆనందం, ఏ. పద్మ, పి. మౌనిక పాల్గొన్నారు.

# వాహనదారులకు హెల్మెట్‌పై అవగాహన



**వేద న్యూస్, రుద్రూర్:** రుద్రూర్ మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంగణంలో బుధవారం ఎస్సై సాయన్న ఆధ్వర్యంలో హెల్మెట్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్సై సూచించారు. హెల్మెట్ ధరించి వాహనం నడిపిన వారికి అభినందనలు తెలుపుతూ పుష్పం అందజేశారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, వాహనదారులు పాల్గొన్నారు.

# హరిహర చారిటబుల్ ట్రస్ట్‌కు విరాళం



**వేద న్యూస్, వేములవాడ ప్రతినిధి:**

వేములవాడలోని హరిహర చారిటబుల్ ట్రస్ట్ నిర్వహిస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలను గుర్తిస్తూ హరిహర ఇండస్ట్రియస్ రైస్ మిల్ యాజమాన్యం రూ.5,116 విరాళంగా అందజేసింది. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులు దాతలకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, వారి కుటుంబ సభ్యులకు శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. హరిహర ఇండస్ట్రియస్ రైస్ మిల్ యాజమాన్యం మాట్లాడుతూ, సమాజ సేవ చేస్తున్న సంస్థలకు తమ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని, మంచి కార్యక్రమాలకు తమ వంతు సహాయం అందించామని తెలిపారు. సమాజ సేవా కార్యక్రమాలకు తోడ్పాటు అందించాలనుకునే వారు హరిహర చారిటబుల్ ట్రస్ట్‌ను సంప్రదించాలని ట్రస్ట్ సభ్యులు సూచించారు.

# పోలీసులపై మద్యం మత్తులో దాడి



**వేద న్యూస్, వేములవాడ ప్రతినిధి:**

వేములవాడ పట్టణంలో ఓ భక్తుడు మద్యం మత్తులో పోలీస్ కానిస్టేబుల్‌పై దాడికి పాల్పడ్డ ఘటన చోటుచేసుకుంది. మంగళవారం అర్ధరాత్రి జాతర గ్రౌండ్‌లో పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా వరంగల్ జిల్లాకు చెందిన ఓ వ్యక్తిని విచారించే క్రమంలో, అతను అతిగా మద్యం సేవించి ఉన్నట్లు గుర్తించారు. ఈ సందర్భంగా ఆ వ్యక్తి బ్లూ కోట్ పోలీస్‌పై చేయి చేసుకున్నాడు. పోలీసులు వెంటనే స్పందించి దాడి చేసిన వ్యక్తితో పాటు మరో ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టినట్లు వేములవాడ సీఐ వీరప్రసాద్ తెలిపారు.

# భీమేశ్వర సన్నిధిలో యాంకర్ సుమ




**వేద న్యూస్, వేములవాడ ప్రతినిధి:**

శివుడి అనుగ్రహం లేకుండా ఏదీ జరగదని ప్రముఖ యాంకర్ సుమ పేర్కొన్నారు. సిరిసిల్లలో కార్యక్రమానికి హాజరైన ఆమె, అనంతరం వేములవాడకు చేరుకుని భీమేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా రాజరాజేశ్వర స్వామికి ఇష్టమైన కోడె మొక్కులు చెల్లించుకున్నట్లు తెలిపారు. స్వామివారి కృపతో అందరూ సుఖశాంతులతో ఉండాలని ప్రార్థించినట్లు చెప్పారు. వేములవాడకు రావడం తనకు ఎంతో ఆనందంగా ఉందని యాంకర్ సుమ పేర్కొన్నారు.

## ఆత్మహత్యాయత్నం చేసిన యువకుడికి ఎమ్మెల్యే పరామర్శ



**వేద న్యూస్, కారేపల్లి:**

వైరా మండలం గరికపాడు గ్రామానికి చెందిన శీలం వెంకట కిరణ్ రెడ్డి హైదరాబాద్‌లో గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన ఘటనపై ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలిసిన వెంటనే ఖమ్మంలోని కిమ్స్ ఆసుపత్రికి చేరుకుని చికిత్స పొందుతున్న యువకుడిని పరామర్శించారు. ఐసీయూలో ఉన్న కిరణ్ రెడ్డి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే, మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. వైద్య ఖర్చులు సహా అవసరమైన అన్ని విధాలుగా అండగా ఉంటామని కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. ప్రాణం ఎంతో విలువైందని, క్షణికావేశంలో తీసుకునే నిర్ణయాలు కుటుంబాలను తీవ్రంగా దెబ్బతీస్తాయని కుటుంబాన్ని ఓదార్చారు. ఈ పరామర్శ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. యువకుడి ప్రాణాల కోసం ఎమ్మెల్యే స్వయంగా ఆసుపత్రికి రావడం పట్ల గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

# కాప్రా ప్రెస్ క్లబ్ అధ్యక్షులుగా మెరుగు చంద్రమోహన్

- కార్యదర్శిగా ముత్యం ముఖేష్ గౌడ్



**వేద న్యూస్, కాప్రా :**

కాప్రా ప్రెస్ క్లబ్ నూతన కమిటీ బుధవారం టిఎస్ఐఐసీ కాలనీలోని ప్రెస్ క్లబ్ లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ సలహాదారులు ఏంపల్లి పద్మారెడ్డి, బెలిదే అశోక్, అధ్యక్షులుగా మెరుగు చంద్రమోహన్, ఉపాధ్యక్షులుగా దిలీప్ కుమార్, యావాపురం రవి, దొమ్మాటి కిరణ్ కుమార్, గార్లపాటి శ్రీనివాస్ రావు, ప్రధాన కార్యదర్శిగా ముత్యం ముఖేష్ గౌడ్, సంయుక్త కార్యదర్శిగా డి. శ్రీనివాస్, కె. వెంకట్, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా ఓ. నరసింహ, కీర్తి శ్రీనివాస్, కోశాధికారిగా రామచంద్రమూర్తి, కార్యవర్గ సభ్యులుగా గంగి కృష్ణ, గోవిందు కుంట్ల ఆంజనేయులు, బుడంపల్లి నిరంత్ గౌడ్, తొడుపునూరు బాలకృష్ణలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్ష కార్యదర్శులు మెరుగు చంద్రమోహన్, ముత్యం ముఖేష్ గౌడ్, కోశాధికారి రామచంద్రమూర్తి మాట్లాడుతూ కాప్రా ప్రెస్ క్లబ్ జర్నలిస్టుల సంక్షేమం కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. తమను కాప్రా ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు, కోశాధికారిగా ఎన్నుకున్న సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. త్వరలో నూతన సభ్యులకు సభ్యత్వాలను అందజేయనున్నట్లు తెలిపారు.

**ప్రెస్ క్లబ్ నూతన కమిటీకి అభినందనల వెల్లువ**

కాప్రా ప్రెస్ క్లబ్ నూతన కమిటీకి పలువురు అభినందనలు తెలిపారు. అధ్యక్షులుగా మెరుగు చంద్రమోహన్, ప్రధాన కార్యదర్శిగా ముత్యం ముఖేష్ గౌడ్, కోశాధికారిగా రామచంద్ర మూర్తిలతో పాటు కమిటీ సభ్యులను ఘనంగా సన్మానించారు. అనంతరం పేరుపేరునా అభినందనలు తెలిపారు. ఏఎస్ రావు నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్లు సింగిరెడ్డి శిరీష సోమశేఖర్ రెడ్డి, పజ్జూరి పావనిరెడ్డి, కొత్త రామారావు, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు బొజ్జ రాఘవరెడ్డి, కొత్త అంజిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఏఎస్ రావునగర్ డివిజన్ అధ్యక్షులు కేశెట్టి ప్రసాద్, తెలంగాణ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మాజీ కార్యదర్శి నీరుకొండ సతీష్ బాబు, బిజెపి చర్లపల్లి డివిజన్ అధ్యక్షులు చల్లా ప్రభాకర్, సీనియర్ నాయకులు కనుకుల రజినీకాంత్ రెడ్డి, బిఆర్ఎస్ ఏఎస్ రావునగర్ డివిజన్ అధ్యక్షుడు కాసం మహిపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పెద్దాపురం కుమారస్వామి, నాయకులు, వంజరి ప్రవీణ్ కరిపే, ఎస్ఏ. రహీమ్, టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి ఎం. శివానంద్ తదితరులు అభినందనలు తెలిపారు.

# రోడ్డు భద్రతా చర్యలు అమలు చేయాలి

- అదనపు కలెక్టర్ గడ్డం నగేష్
- రోడ్డు సేఫ్టీ కమిటీ సమావేశం నిర్వహణ



**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**

జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రణాళికాబద్ధంగా భద్రతా చర్యలు అమలు చేయాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ఆదేశించారు. బుధవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ఆర్అండ్బీ, నేషనల్ హైవేస్, పీఆర్, పోలీస్, రవాణా, వైద్య, ఎక్సైజ్, విద్య, ఆర్టీసీ తదితర శాఖల అధికారులతో రోడ్డు సేఫ్టీ కమిటీ సమావేశం నిర్వహించారు. గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలుపై సమీక్షించి, రవాణా, పోలీస్, ఆర్అండ్బీ శాఖలు సంయుక్తంగా నిర్వహించిన సర్వే వివరాలను పరిశీలించారు. ప్రధాన రహదారుల్లో గుర్తించిన బ్లాక్ స్పాట్స్ వద్ద రంబుల్ స్ట్రిప్స్, సోలార్ సిగ్నల్స్, సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. రహదారులకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించాలని ఆదేశించారు. పలు జంక్షన్ల వద్ద స్పీడ్ గన్స్, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, ఇప్పటికే ఉన్న పరికరాల పనితీరును పునఃసమీక్షించాలని చెప్పారు. జిల్లాలోని అన్ని పెట్రోల్ బంక్‌లలో నో హెల్మెట్ నో పెట్రోల్ నిబంధనను కచ్చితంగా అమలు చేయాలని సూచించారు. పరిమితికి మించి విద్యార్థులు, ప్రయాణీకులను తరలిస్తున్న వాహనాలు, ఓవర్‌లోడ్ సరుకు రవాణా వాహనాలపై కఠిన చర్యలు తీసుకోవాలని రవాణా శాఖ అధికారులకు ఆదేశించారు. సమావేశంలో అదనపు ఎస్పీ చంద్రయ్యతో పాటు ఆర్టీఏ సభ్యుడు సంగీతం శ్రీనాథ్, ఆర్ అండ్ బీ, నేషనల్ హైవేస్, పీఆర్, విద్య, ఎక్సైజ్, మున్సిపల్, ఆర్టీసీ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# హామీలు నెరవేరుస్తూ ముందుకెళ్తున్నాం

- ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్
- పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన



**వేద న్యూస్, వేములవాడ ప్రతినిధి:**

వేములవాడ రూరల్ మండలంలోని నూకలమర్రి, వట్టెంలా గ్రామాల్లో బుధవారం ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తూ ముందుకు సాగుతోందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రైతు రుణమాఫీ వంటి పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయాలనే లక్ష్యంతో మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు అందిస్తున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తోందని అన్నారు.

వేద న్యూస్

గురువారం ఫిబ్రవరి 26, 2026

# వడ్డే నారాయణ కుటుంబానికి ఎమ్మెల్యే భరోసా..

**వేద న్యూస్, కారేపల్లి:**

ప్రజా ప్రతినిధి అంటే కేవలం అధికారానికి పరిమితం కాకుండా, కష్టాల్లో ఉన్న కార్యకర్తలకు, నాయకులకు అండగా నిలవాలని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ మరోసారి నిరూపించారు. ఇటీవల కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ ఖమ్మంలోని కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కొణిజర్ల మండల అధ్యక్షులు వడ్డే నారాయణ తండ్రిని ఎమ్మెల్యే బుధవారం స్వయంగా పరామర్శించారు. ఆసుపత్రికి చేరుకున్న ఎమ్మెల్యే చికిత్స పొందుతున్న వడ్డే నారాయణ తండ్రిని కలిసి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించడంలో ఎలాంటి లోటు లేకుండా చూడాలని అక్కడి వైద్యులకు సూచించారు. అవసరమైన అన్ని వైద్య సౌకర్యాలు కల్పించాలని ఆసుపత్రి యాజమాన్యాన్ని ఆదేశించారు. పార్టీ కోసం కష్టపడే ప్రతి కార్యకర్త కుటుంబం నా కుటుంబం లాంటిదే. ఏ కష్టం వచ్చినా నేనున్నాననే ధైర్యం మీకు ఉండాలి అని ఈ సందర్భంగా ఎమ్మెల్యే వడ్డే నారాయణ కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. బిజీ షెడ్యూల్‌లో ఉన్నప్పటికీ సమాచారం అందిన వెంటనే ఆసుపత్రికి చేరుకుని పరామర్శిం



చడంపై పార్టీ శ్రేణులు, స్థానికులు ప్రశంసలు వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే రాకతో వడ్డే నారాయణ కుటుంబంలోనే కాకుండా మండల పార్టీ కార్యకర్తల్లోనూ కొత్త ఉత్సాహం నెలకొంది. నాయకుడు అంటే కేవలం ఓట్ల కోసం వచ్చే వ్యక్తి కాదు, కష్టకాలంలో తోడుండే ఆపద్బాంధవుడని రాందాస్ నాయక్ మరోసారి చాటిచెప్పారు.

# ఇంటర్ పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన ఎస్పీ

**- పటిష్ట పోలీస్ బందోబస్తు**



**వేద న్యూస్, మెదక్:**

బుధవారం ప్రారంభమైన ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల సందర్భంగా మెదక్ జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు పలు పరీక్ష కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణ, భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు పటిష్టంగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనవసర గుంపులు లేకుండా చూడాలని, సెల్‌ఫోన్లు సహా ఎలక్ట్రానిక్ పరికరాలను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించవద్దని సూచించారు. విద్యార్థులకు తాగునీరు, వైద్య సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రశ్నపత్రాల రవాణా, పరీక్షల అనంతరం జవాబు పత్రాల తరలింపును పూర్తి భద్రతతో నిర్వహించాలని ఆదేశించారు. ఇంటర్ పరీక్షలు సజావుగా, పారదర్శకంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేస్తోందని ఎస్పీ తెలిపారు.

# ఉచిత శిక్షణ కోర్సును సద్వినియోగం చేసుకోవాలి

**- ఐటీఐ ప్రిన్సిపాల్ జి. దేవానంద్**



**వేద న్యూస్, మందమర్రి:**

మంచిర్యాల జిల్లా మందమర్రి పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐలో పీఎం కేవీవై 4.0 ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మూడు నెలల ఉచిత శిక్షణ తరగతులను నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని ఐటీఐ ప్రిన్సిపాల్ జి. దేవానంద్ కోరారు. బుధవారం ఐటిఐ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ, నిరుద్యోగులకు ఎలక్ట్రిక్ వెహికల్ సర్వీస్ టెక్నీషియన్ కోర్సును ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు 10వ తరగతి మెమో, ఆధార్ కార్డు, మెయిల్ ఐడి, ఫోన్ నంబర్, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు, బ్యాంక్ ఖాతా వివరాలతో ఐటిఐ కార్యాలయంలో నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కోర్సు మార్చి 2 నుండి ప్రారంభమవుతుందని ఆయన వెల్లడించారు.

# మరిపెడ హైస్కూల్‌ను తనిఖీ చేసిన అదనపు కలెక్టర్

**వేద న్యూస్, మరిపెడ:**




మహబూబాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టోపో మంగళవారం మరిపెడ మున్సిపాలిటీలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యాభ్యాసం చేస్తున్న పదవ తరగతి విద్యార్థులను, ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు బయగాని రామ్మోహన్‌ను అడిగి విద్యార్థుల ప్రగతిపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో పాఠ్యపఠనం చేయించి, ప్రీ ఫైనల్ పరీక్షల మూల్యాంకనం చేసిన సమాధాన పత్రాలను పరిశీలించారు. విద్యార్థులకు, ఉపాధ్యాయులకు తగిన సూచనలు అందజేసిన అదనపు కలెక్టర్, విద్యా ప్రమాణాలు మెరుగుపడేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా మరిపెడ మండల రెవెన్యూ అధికారి కృష్ణవేణి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి వేణుగోపాల్ రెడ్డి, మరిపెడ మున్సిపల్ కమిషనర్ విజయానంద్‌లను తరచుగా పాఠశాలను సందర్శించి విద్యార్థుల ప్రగతిపై పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు.

# ఎస్సారెస్పీ కాల్వలో గుర్తుతెలియని మృతదేహం లభ్యం

**వేద న్యూస్, చొప్పదండి:**



మండలంలోని పెద్ద కురుమపల్లి గ్రామ శివారులో జంగమునికుంట సమీపంలోని ఎస్సారెస్పీ కాల్వలో బుధవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైందని ఎస్ఐ నరేష్ రెడ్డి తెలిపారు. మృతుని వయసు సుమారు 40-50 సంవత్సరాల మధ్యగా, ఎత్తు సుమారు 5 అడుగులు 6 అంగుళాలు ఉండవచ్చని తెలిపారు. మృతదేహం నీటిలో ఉండడంతో ఉబ్బిన స్థితిలో ఉంది. తలపై తెల్ల వెంట్రుకలు ఉన్నాయి. ఒంటిపై గ్రీన్ గీతలున్న షర్ట్, ఎరుపు రంగు టీ షర్ట్, లైట్ క్రీమ్ రంగు టీ-షర్ట్ ఇలా మూడు షర్టులు ధరించి ఉన్నాడు. అలాగే జీన్స్ షార్ట్ నిక్కర్, నలుపు రంగు ప్యాంటు, లోయర్ కలిపి మూడు ప్యాంట్లు ధరించి ఉన్నాడు. వేషధారణను బట్టి మృతుడు మతిస్థిమితం లేని వ్యక్తి అయి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. గ్రామ పాలనా అధికారి రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. వివరాలు తెలిసిన వారు 8712670766, 9440501014 నంబర్లకు సంప్రదించాలని పోలీసులు కోరుతున్నారు.

# ఎస్ఎఫ్ఐ ప్రతిభా పరీక్ష విజయవంతం

**- విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, సృజనాత్మకత పెంపుదలే లక్ష్యం**

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల ప్రతినిధి:**



సిరిసిల్ల కేంద్రంగా భారత విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థుల కోసం ప్రతిభా పరీక్ష నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన సుమారు వెయ్యి మంది విద్యార్థులు ఈ పరీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారత విద్యార్థి సమాఖ్య జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్ మాట్లాడుతూ, విద్యార్థుల్లో ఉన్న పరీక్ష భయాన్ని తొలగించి వార్షిక పరీక్షలకు ధైర్యంగా సన్నద్ధం చేయడమే ఈ ప్రతిభా పరీక్ష ప్రధాన ఉద్దేశమని తెలిపారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, సృజనాత్మకత పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సమాఖ్య నాయకులు సంజన, మనోజ్ కుమార్, శివ, మహేష్, నవీన్, రాకేష్, సాయి రామ్ తదితరులు పాల్గొన్నారు.

# ముష్కరులపై కఠిన చర్యలు తీసుకోవాలి

**- స్థానిక పోలీసులు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు**

**- డీజీపీకి వినతిపత్రం అందజేసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు**

**వేద న్యూస్, నిజామాబాద్:**

గత కొద్ది రోజులుగా బాన్సువాడ, రుద్రూర్, ఇందూర్ అర్బన్ పరిధిలోని మిర్చి కాంపౌండ్ తదితర ప్రాంతాల్లో కొంతమంది ముష్కరులు హిందువులపై ఉద్దేశపూర్వకంగా దాడులకు పాల్పడుతున్నారని, ఇలాంటి దాడులకు పాల్పడుతున్న ముష్కరులపై వెంటనే చర్యలు తీసుకోవాలని బుధవారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు రాష్ట్ర డీజీపీకి వినతిపత్రం అందజేశారు. స్థానిక పోలీసు అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినప్పటికీ వారు పట్టించుకోకుండా తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ఈ దాడులపై, అసాంఘిక శక్తుల అరాచకాలపై స్థానిక పోలీసు అధికారులకు బాధితులు పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ వారి వైపు నుంచి కనీస స్పందన లేదని వినతిపత్రంలో పేర్కొన్నారు. స్థానిక పోలీసులు పక్షపాత ధోరణితో బాధ్యతారాహిత్యంగా వ్యవహరించడం అత్యంత శోచనీయమని అన్నారు. పోలీసుల ఈ నిర్లక్ష్య వైఖరి వల్లే దాడులు చేసేవారికి మరింత ప్రోత్సాహం లభించి, శాంతిభద్రతల సమస్య తలెత్తుతోందని పేర్కొన్నారు. హిందువులపై దాడులకు పాల్పడిన ముష్కరులను, వారికి వెనుకనుండి సహకరిస్తున్న శక్తులను వెంటనే గుర్తించి అరెస్టు చేసి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో బీజేపీ జిల్లా అధ్యక్షులు శ్రీ దినేష్ పటేల్ కులకర్ణి, ఎమ్మెల్యే పాల్వాయి హరీష్, ఎమ్మెల్సీలు మల్కా కొమరయ్య, అంజిరెడ్డి, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు గౌతమ్ రావు, అశోక్, కామారెడ్డి జిల్లా అధ్యక్షులు నీలం రాజు, ఇందూర్ జిల్లా ప్రభారి కాంతారావు,



కామారెడ్డి జిల్లా ప్రభారి విక్రమ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ, లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ ఆంటోనీ రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు మురళీధర్ గౌడ్ తదితరులు ఉన్నారు.

# పరీక్షలలో ఒత్తిడి లేకుండా రాణించాలి

**- బీసీ హాస్టల్ విద్యార్థులకు నిపుణుల సూచనలు**



**వేద న్యూస్, వేములవాడ ప్రతినిధి:**

వేములవాడలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి సౌజన్య ఆధ్వర్యంలో పదవ తరగతి చదువుతున్న బీసీ హాస్టల్ విద్యార్థులకు ప్రత్యేక అవగాహన, ప్రేరణ కార్యక్రమం నిర్వహించారు. సబ్జెక్టు నిపుణులు పరీక్ష విధానం, ప్రశ్నాపత్రాల రూపకల్పన, సమయ నిర్వహణపై విద్యార్థులకు వివరించారు. పరీక్షల సమయంలో ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంతంగా రాయాలని సూచించారు. మనోవిజ్ఞాన నిపుణులు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించేలా ప్రేరణాత్మక ఉపన్యాసాలు అందించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యాలయ సూపరింటెండెంట్ రేవంత్, అధ్యాపకులు, హాస్టల్ వెల్ఫేర్ అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు. ఉపాధ్యాయుల సూచనలు పాటిస్తూ పరీక్షలకు హాజరై అత్యుత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా అధికారి సౌజన్య ఆకాంక్షించారు. కార్యక్రమం ముగింపులో విద్యార్థులకు పరీక్షా సామగ్రిని పంపిణీ చేశారు. కొడం లక్ష్మీనారాయణ, జ్యోతి, రాజశేఖర్, నరేష్, కళ్యాణి తదితరులు హాజరయ్యారు.

# పొత్తూరు వద్ద కాలేజీ బస్సు, కారు ఢీ

**- ఒకరికి స్వల్ప గాయాలు.. డ్రైవర్‌పై కేసు నమోదు**



**వేద న్యూస్, ఇల్లంతకుంట:**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం పొత్తూరు గ్రామ చర్చి సమీపంలో బుధవారం ప్రైవేట్ కాలేజీ బస్సు, బలేనో కారు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న వారికి తృటిలో ప్రాణాపాయం తప్పగా, ఒకరికి స్వల్ప గాయాలయ్యాయి. సిరిసిల్లకు చెందిన రిక్కమల్ల సంతోష్ కుమార్ కుటుంబ సభ్యులతో కలిసి కారులో మానసాదేవి ఆలయ దర్శనానికి వెళ్తుండగా ప్రమాదం జరిగింది. ఎదురుగా వచ్చిన కాలేజీ బస్సు కారును ఢీకొట్టడంతో కారు ముందు భాగం తీవ్రంగా దెబ్బతింది. కారులో ఉన్న సంతోష్ కుమార్ అత్తకు స్వల్ప గాయాలు కావడంతో చికిత్స అందించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు, ప్రమాదానికి కారణమైన రేపాక గ్రామానికి చెందిన బస్సు డ్రైవర్ హరీష్‌పై కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఎస్ఐ సిరిసిల్ల అశోక్ తెలిపారు.

# ఇసుక రవాణా నిలిపివేయాలి

**- భూగర్భ జలాలపై ప్రభావం ఉంటుంది**

**- హైలెవల్ బ్రిడ్జికి దెబ్బతినే అవకాశం**

**- ఎమ్మార్వోకు సర్పంచ్ జంకె మధు వినతి**

**వేద న్యూస్, వేములవాడ రూరల్:**

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రూరల్ మండలం హన్మాజీపేట గ్రామంలో జరుగుతున్న అక్రమ ఇసుక రవాణాను వెంటనే నిలిపివేయాలని గ్రామ సర్పంచ్ జంకె మధు, పంచాయతీ పాలకవర్గ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు వేములవాడ మండల రెవెన్యూ అధికారికి అబు బాకర్‌కు వినతిపత్రం సమర్పించారు. గ్రామంలోని మూలవాగు నుండి యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయని, దీంతో హన్మాజీపేట-లింగంపల్లి మధ్య ఉన్న హై లెవల్ బ్రిడ్జి పునాదులు దెబ్బతినే ప్రమాదం ఉందని తెలిపారు. అలాగే మంచినీటి బావుల సమీపంలో ఇసుక తరలింపుతో భూగర్భ జలాలు తగ్గిపోవచ్చని, రాబోయే వేసవిలో నీటి ఎద్దడి తీవ్రరూపం దాల్చే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇసుక రవాణా కారణంగా గ్రామంలోని పైపులైన్లు కూడా దెబ్బతింటున్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. గ్రామ ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని వెంటనే ఇసుక తవ్వకాలు నిలిపివేసి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ వార్డు సభ్యులు పాల్గొన్నారు.



వేద న్యూస్

గురువారం ఫిబ్రవరి 26, 2026

# దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలి



వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల ప్రతినిధి:

- వారసత్వ ఉద్యోగ అవకాశాలు కల్పించాలి
- ఈఎస్ఐ సౌకర్యం కల్పించి.. గుర్తింపు కార్డులు ఇవ్వాలి
- సిరిసిల్లలో మున్సిపల్ కార్మికుల ధర్నా

సిరిసిల్లలో మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట భారీ ధర్నా నిర్వహించారు. తమ డిమాండ్ల సాధన కోసం కార్మికులు కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషాకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు కోడం రమణ, మూషం రమేష్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల పట్ల అధికారులు నిర్లక్ష్య ధోరణి ప్రదర్శించడం తగదని విమర్శించారు. ముఖ్యంగా 60 ఏళ్లు పైబడిన వారు, మరణించిన వారు లేదా అనారోగ్యంతో పని చేయలేని కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు వారసత్వ ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా 2009 నుంచి 2012 వరకు పెండింగ్‌లో ఉన్న మూడు సంవత్సరాల పీఎఫ్ బకాయిలను వెంటనే కార్మికుల ఖాతాల్లో జమ చేయాలని, విలీన గ్రామాలకు చెందిన కార్మికుల పీఎఫ్ నిధులను విడుదల చేయాలని కోరారు. కార్మికులందరికీ ఈఎస్ఐ సౌకర్యం కల్పించి, గుర్తింపు కార్డులను తక్షణమే జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్మికుల నిరసనపై స్పందించిన మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా, సమస్యలను వారం రోజుల్లోగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కమిషనర్ హామీతో కార్మికులు తాత్కాలికంగా ధర్నాను విరమించారు. అయితే నిర్ణీత గడువులోగా సమస్యలు పరిష్కారం కాకపోతే, వారం రోజుల తర్వాత పనులను బంద్ చేసి నిరవధిక సమ్మెకు దిగుతామని సీఐటీయూ నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కాసారపు శంకర్, సిరిసిల్ల మున్సిపల్ యూనియన్ అధ్యక్షుడు ఏల్పుల బాలయ్యతో పాటు రాజయ్య, బాబా కిషన్, మమత, లక్ష్మి, యశోద, నరేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఒగ్గు రమేష్ కు మంత్రి పొన్నం సన్మానం





వేద న్యూస్, జమ్మికుంట:

జమ్మికుంట మున్సిపాలిటీ 28వ వార్డు కౌన్సిలర్ ఒగ్గు రమేష్ హైదరాబాద్ లో తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ ,రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ను బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతనంగా కౌన్సిలర్ గా ఎన్నికైన ఒగ్గు రమేష్ ను మినిస్టర్ పొన్నం శాలువాతో సత్కరించారు. జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ ను కూడా రమేశ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఒగ్గు రమేష్ ను యువ లీడర్, ఎమ్మెల్యే నవీన్ యాదవ్ కూడా సత్కరించారు. జమ్మికుంట కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ఎన్నికల చార్జి , రెహమత్ నగర్ కార్పొరేటర్ సిఎన్ రెడ్డినీ.. రమేష్ మర్యాదపూర్వకంగా కలవగా, ఆయన కూడా రమేష్ ను సన్మానించారు. కాంగ్రెస్ పార్టీ క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం కావడం కోసం కృషి చేయాలని సూచించారు.

# అన్నదాత సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- చొప్పదండి నియోజకవర్గాన్ని వాటర్ హబ్ గా తీర్చిదిద్దుతాం – ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



వేద న్యూస్, గంగాధర:

చొప్పదండి నియోజకవర్గంలో రైతులు సాగుచేసిన యాసంగి పంటలు ఎండిపోకుండా చివరి మడి వరకు సాగునీరు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తెలిపారు. అన్నదాత సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. బుధవారం గాయత్రి పంపు హౌస్ నుంచి వరద కాలువకు నీటిని విడుదల చేసే అంశంపై సంబంధిత శాఖ అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించినట్లు తెలిపారు. రెండు రోజుల్లో వరద కాలువ ద్వారా నీటిని విడుదల చేసి పంటలకు సాగునీరు అందిస్తామని అధికారులు హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. ప్రతిపక్షాల వ్యాఖ్యలను నమ్మి రైతులు ఆందోళన చెందవద్దని సూచించిన ఎమ్మెల్యే, నియోజకవర్గంలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందించే దిశగా ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. చొప్పదండి నియోజకవర్గాన్ని వాటర్ హబ్ గా అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు. రైతులు ధైర్యంగా ఉండాలని, ప్రభుత్వం ఎల్లప్పుడూ అన్నదాతల పక్షాన నిలుస్తుందని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తెలిపారు.

# ‘మహాలక్ష్మి కానుక’గా రూ.2,016 పంపిణీ



వేద న్యూస్, గంగాధర:

గంగాధర మండలం కురిక్యాల గ్రామానికి చెందిన కనుకుంట్ల రాకేష్–లాస్య దంపతుల కుమార్తె నామకరణ మహోత్సవం సందర్భం గా గ్రామ సర్పంచ్ కదారి రేణుక – కనకయ్య దంపతులు శిశువుకు రూ. 2,016లను ‘మహాలక్ష్మి కానుక’ గా అందజేశారు. ఆడపిల్లల పుట్టు కను గౌరవించడం, వారి విద్యా భవిష్యత్ అభివృద్ధిపై అవగాహన పెంపొందించడం లక్ష్యంగా ఈ నగదు సాయం అందించినట్లు తెలిపారు. గ్రామంలో ఆడబిడ్డలకు ప్రాధాన్యత ఇస్తూ నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని గ్రామస్తులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ గుండారపు మహేష్, పంచాయతీ కార్యదర్శి జ్యోతి, వార్డు సభ్యులు అవుదుర్తి కళ్యాణి, కదారి కీర్తన–వెంకటేష్, జవ్వాజి మహేందర్, మ్యాకల రాజేశ్వరి–రాజు, అవుదుర్తి మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు విద్యే భవిష్యత్

- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



వేద న్యూస్, పాపన్నపేట:

పాపన్నపేట మండలం నాగసానిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల సామర్థ్యాన్ని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, విద్యార్థులకు విద్యే భవిష్యత్‌కు పునాది అని పేర్కొన్నారు. పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి తల్లిదండ్రులు, గురువులకు మంచి పేరు తేవాలని సూచించారు. ఈ సంవత్సరం 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని విద్యార్థులను ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# నిజాయితీ చాటుకున్న దంపతులు

- పోగొట్టుకున్న పర్సు బాధితుడికి అందజేత




వేద న్యూస్, టేక్మాల్:

మెదక్ జిల్లా టేక్మాల్ మండలంలోని కోరంపల్లి గ్రామానికి చెందిన కటిక భాష పనిమీద శంకరంపేట్‌కు వెళ్తుండగా తన పర్సును మధ్యలో పోగొట్టుకున్నాడు. ఆ పర్సులో రూ.5,000 నగదు, ఆధార్ కార్డు, పాన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ తదితర కీలక పత్రాలు ఉన్నాయి. ఇదే సమయంలో సూరంపల్లి గ్రామానికి చెందిన కురుమ నరసింహులు, ఆయన భార్య కురుమ లక్ష్మి దంపతులకు ఆ పర్సు లభించింది. తమ నిజాయితీని చాటుకుంటూ వారు వెంటనే పర్సును స్థానిక పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. దంపతుల నిజాయితీని పోలీసులు అభినందించారు. అనంతరం బాధితుడు కటిక భాషను పిలిపించి పర్సును అందజేశారు. తనకు చెందిన విలువైన పత్రాలు, నగదు తిరిగి దొరకడంతో భాష దంపతులకు, పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

# ఆలస్యంగా రావడంతో పరీక్షకు అనుమతి లేదు



వేద న్యూస్ ఎల్లారెడ్డిపేట :

ఎగ్జామ్ సెంటర్‌కు ఆలస్యంగా రావడంతో ఇంటర్ విద్యార్థినిని పరీక్ష రాసేందుకు అనుమతించలేదు. తన తండ్రి డ్రాప్ చేస్తాడేమోనని ఎదురుచూసి చూసి, చివరకు ఆర్టీసీ బస్సులో రావడంతో ఎగ్జామినేషన్ సెంటర్‌కు 17 నిమిషాలు ఆలస్యంగా చేరుకుంది. ఈ క్రమంలో అధికారులు పరీక్షకు అనుమతించకపోవడంతో.. సెంటర్ గేటు వద్దనే విద్యార్థిని కన్నీళ్లు పెట్టుకుంది. రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేటలో ఈ విషాద ఘటన చోటు చేసుకుంది.

# 17 లక్షల మందికి ఆరోగ్య భరోసా

- సీఎంకు ప్రత్యేక ధన్యవాదాలు: జిల్లా బ్రాంచ్ అధ్యక్షుడు ఎంబి కృష్ణ యాదవ్



వేద న్యూస్, హైదరాబాద్:

తెలంగాణ రాష్ట్ర ఉద్యోగులు, పెన్షనర్లకు ఈ.హెచ్.ఎస్– నగదు రహిత చికిత్స పథకం, రూ. 1.20 కోట్ల ప్రమాద కోట్ల మూలనిధితో పథకానికి నేపథ్యంలో అన్ని ఉద్యోగ వర్గాల చిరకాల వాంఛను నెరవేర్చారంటూ తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ హైదరాబాద్ జిల్లా బ్రాంచ్ అధ్యక్షుడు ఎం బి కృష్ణ యాదవ్, కార్యదర్శి ఎం.ఎ. ఖాదర్ లు ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. ఉద్యోగులు, పెన్షనర్లకు ప్రభుత్వం ప్రకటించిన ఆరోగ్య, బీమా పథకాలు చరిత్రలో నిలిచిపోతాయని వారు కొనియాడారు. 1,998 వ్యాధులకు నగదు రహిత చికిత్స లను పొందే విధంగా ఉద్యోగులు, పెన్షనర్లకు అవకాశం లభించడం ఎంతో ఆనందదాయకం అని తెలిపారు. చారిత్రక నిర్ణయంతో 7 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు వారి కుటుంబ సభ్యులు 17 లక్షల మందికి నగదు రహిత ఆరోగ్య భరోసా లభిస్తుందన్నారు. ఈ సందర్భంగా కేబినెట్ మంత్రులకు, హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ కి, ఇట్టి ప్రయోజనాలను సాధించటంలో కృషి సలిపిన టిజివో రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాస్, రాష్ట్ర జనరల్ సెక్రెటరీ బి.శ్యామ్ కి ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ ఆశన్న, ట్రెజరర్ వెంకటరమణ, వైస్ ప్రెసిడెంట్ , సంయుక్త కార్యదర్శులు డాక్టర్. క్రొత్త విద్యా సాగర్, శ్రీరామ్, సరస్వతి పాల్గొన్నారు.

# ప్రజలందరికీ విద్య, వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యం

- మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి




వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి:

ప్రజలందరికీ విద్య, వైద్యం అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం వేములపల్లి మండలం ఆమనగల్లు గ్రామంలో సూర్యాపేట లయన్స్ క్లబ్ సౌజన్యంతో యశోద హాస్పిటల్ వైద్యుల బృందం నిర్వహించిన ఉచిత మెగా హెల్త్ క్యాంపును లయన్స్ క్లబ్ చైర్మన్ మిర్యాల సుధాకర్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, నిరుపేదలను గుర్తించి సంక్షేమ ఫలాలు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు. మారుమూల ప్రాంతాల్లోని పేదలకు వైద్య సేవలు అందించేందుకు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీ యమన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. లయన్స్ క్లబ్ చైర్మన్ మిర్యాల సుధాకర్ మాట్లాడుతూ, ఈ మెగా హెల్త్ క్యాంపులో సుమారు 300 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. గ్రామ ప్రజలకు ఎలాంటి అవసరం వచ్చినా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు పిల్లల సందీప్, ఎలికంటి భరత్, ఉపసర్పంచ్ శాలెం రాజు, రామలింగేశ్వర దేవాలయ చైర్మన్ బ్రహ్మదేవర విద్యాసాగర్, లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ గవర్నర్ రేపాల మదన్మోహన్, ఐ హాస్పిటల్ చైర్మన్ దోసపాటి గోపాల్, పివిసి అధినేత మీలా మహాదేవ్, జిల్లా కోఆర్డినేటర్ గుడిపూడి వెంకటేశ్వరరావు, లయన్స్ క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత



- నాణ్యతా ప్రమాణాలతో ఫుట్‌పాత్‌ల నిర్మాణం చేయాలి
- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి:**

నగరంలో ప్రజల భద్రత, సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఆధునిక మౌలిక వసతులతో ఫుట్‌పాత్‌ల నిర్మాణం చేపట్టాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సూచించారు. బుధవారం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్యతో కలిసి నగరంలోని 2వ డివిజన్ బల్లేపల్లి పరిసర ప్రాంతంలో నిర్మిస్తున్న ఫుట్‌పాత్ పనులను, టైల్స్ డిజైన్ ఆకృతులను పరిశీలించారు. ఫుట్‌పాత్ నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని అధికారులకు ఆదేశించారు. ఫుట్‌పాత్‌లు చిన్నపిల్లలు, వృద్ధులు, దివ్యాంగులు సైతం సులభంగా నడిచే విధంగా సౌకర్యవంతంగా ఉండాలని సూచించారు. వర్షం, ఎండ వంటి వాతావరణ పరిస్థితులకు అనుకూలంగా దీర్ఘకాలికంగా నిలిచే టైల్స్ వినియోగించాలన్నారు. రాత్రివేళ అసౌకర్యం లేకుండా తగిన లైటింగ్ ఏర్పాటు చేయాలని, స్లోప్‌లు, ఎడ్జ్‌లు సరిగా రూపకల్పన చేయాలని సూచించారు. నగరంలో ముఖ్య ప్రాంతాల్లో ఒకే విధమైన డిజైన్‌తో గ్రానైట్ ఫుట్‌పాత్‌లు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఫుట్‌పాత్‌ల అభివృద్ధి వల్ల ప్రజలు నడక వైపు మొగ్గు చూపి ఆరోగ్యం మెరుగుపడుతుందని పేర్కొన్నారు. పనుల్లో ఎక్కడా నిర్లక్ష్యం చోటు చేసుకోకుండా బాధ్యతగా పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ మల్లీదు వెంకటేశ్వర్లు, పబ్లిక్ హెల్త్ ఎస్ఈ రంజిత్, మున్సిపల్ ఈఈ కృష్ణలాల్, సహాయ కమిషనర్ అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కన్న కూతురిని హతమార్చిన తల్లి





**వేద న్యూస్ అమరావతి:**

తిరుపతిలో హృదయ విదారక ఘటన వెలుగుచూసింది. రెండున్నర ఏళ్ల చిన్నారి దుర్గను ఆమె తల్లి ఆశలతా హత్య చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ప్రియుడి మోజులో పడి కన్న ప్రేమను మరిచిన తల్లి ఈ దారుణానికి పాల్పడినట్లు విచారణలో తేలింది. పెళ్లికి అడ్డొస్తుందనే నెపంతో చిన్నారిని హతమార్చిన ఆశలతా, అనంతరం గుట్టుచప్పుడు కాకుండా పాప మృతదేహాన్ని పాతిపెట్టినట్లు సమాచారం. మనవరాలు కనిపించడం లేదని అమ్మమ్మ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. ఈస్ట్ పోలీస్ స్టేషన్ సిబ్బంది కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఫోన్ సిగ్నల్ ఆధారంగా ఆశలతను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారణలో ఆమె నేరాన్ని అంగీకరించినట్లు అధికారులు తెలిపారు. ఏర్పేడు మండలం పాపానాయుడు పేట సమీపంలోని స్వర్ణముఖి నది ఒడ్డున మృతదేహాన్ని పూడ్చిపెట్టినట్లు ఆమె చెప్పినట్లు సమాచారం. మరికొద్ది సేపట్లో ఎమ్మార్వో సమక్షంలో మృతదేహాన్ని వెలికితీసి పంచనామా నిర్వహించనున్నట్లు పోలీసులు తెలిపారు. అనంతరం పోస్టుమార్టం కోసం ఆసుపత్రికి తరలించనున్నారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.

# ఒక్క ఫోన్ కాల్‌తో ఘటనాస్థలానికి చేరుకున్న ఎమ్మెల్యే



**వేద న్యూస్ అమరావతి:**

గుంటూరు నగరంలోని బృందావన్ గార్డెన్స్ ప్రాంతంలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయంటూ వచ్చిన ఫిర్యాదుపై ఎమ్మెల్యే గళ్ళా మాధవి వెంటనే స్పందించారు. నిర్మానుష్య ప్రదేశంలో కొంతమంది యువకులు మాదకద్రవ్యాలు సేవిస్తూ స్థానికులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఓ మహిళ ఫోన్ ద్వారా ఎమ్మెల్యేకు సమాచారం అందించారు. ఫిర్యాదు అందుకున్న వెంటనే ఎమ్మెల్యే గళ్ళా మాధవి ద్విచక్ర వాహనంపై స్వయంగా ఘటనాస్థలానికి చేరుకున్నారు. ఆమె రాకను గమనించిన యువకులు అక్కడి నుంచి పరారయ్యారు. అనంతరం స్థానిక ప్రజలతో పాటు ఫిర్యాదు చేసిన మహిళతో మాట్లాడి పూర్తి వివరాలు తెలుసుకున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా క్రమం తప్పకుండా గస్తీ నిర్వహించాలని సంబంధిత పోలీసులకు ఎమ్మెల్యే ఆదేశాలు జారీ చేశారు. ప్రజల భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు. ఒక్క ఫోన్ కాల్‌కే ఇంత వేగంగా స్పందించి స్వయంగా సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవడం పట్ల స్థానికులు ఎమ్మెల్యే గళ్ళా మాధవికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల భద్రతకు కట్టుబడి ఉన్న ప్రజాప్రతినిధిగా ఆమె వ్యవహరించడం ప్రశంసనీయమని పేర్కొన్నారు

# ఈఎస్ఐ ఆసుపత్రి తనిఖీ



**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి:**

వరంగల్లోని ఈఎస్ఐ ఆసుపత్రిని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, జిల్లా కలెక్టర్ సత్య శారదతో కలిసి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని అవుట్‌పేషెంట్ విభాగం, ఇన్‌పేషెంట్ వార్డులు, మందుల సరఫరా, వైద్య సేవల పరిస్థితిని ఎంపీ స్వయంగా పరిశీలించారు. రోగులతో మాట్లాడి వారికి అందుతున్న చికిత్సపై వివరాలు తెలుసుకున్నారు. వరంగల్ జిల్లాకు త్వరలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, మెగా టెక్స్టైల్ పార్క్, విమానాశ్రయం వంటి మూడు ప్రధాన ప్రాజెక్టులు రానున్న నేపథ్యంలో కార్మికుల సంఖ్య భారీగా పెరిగే అవకాశం ఉందని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య తెలిపారు. ఈ కారణంగా చికిత్స కోసం ఈఎస్ఐ ఆసుపత్రికి వచ్చే రోగుల సంఖ్య మరింత పెరుగుతుందని పేర్కొంటూ, భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఆసుపత్రి సౌకర్యాలను ఇప్పటినుంచే బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలోనే ఈఎస్ఐ ఆసుపత్రిని తనిఖీ చేసినట్లు ఎంపీ వెల్లడించారు. అనంతరం ఆసుపత్రి వైద్యులు, నర్సులు, సిబ్బందితో ఎంపీ, కలెక్టర్ లు సమావేశమై ఆసుపత్రి నిర్వహణ, సౌకర్యాల లోటుపాట్లు, సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. వైద్యుల ఖాళీల భర్తీ, మందుల కొరత, శానిటేషన్ పరిస్థితులపై ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు. ఆసుపత్రికి అవసరమైన నిధులు, వసతులు తన దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కార దిశగా కృషి చేస్తానని ఎంపీ హామీ ఇచ్చారు. ఆసుపత్రి పరిసరాల్లో పరిశుభ్రతను మెరుగుపరచడంతో పాటు జంగిల్ క్లియరెన్స్ చేపట్టి తక్షణమే శుభ్రపరిచే చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఓ డాక్టర్ బి. సాంబశివరావు, ఆసుపత్రి సివిల్ సర్జన్స్ డాక్టర్ స్వరాజ్యలక్ష్మి, డాక్టర్ అశోక్, డాక్టర్ రామచంద్ర, ఆర్ఎంఓ డాక్టర్ యుగేందర్ ఇతర వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.తి లేదు

# సంగినేనిపల్లి, కల్వరాలలో మంత్రి పర్యటన

వేద న్యూస్ కొల్లాపూర్ : కొల్లాపూర్ నియోజకవర్గంలోని సంగినేనిపల్లి, కల్వరాల గ్రామాల్లో మంత్రి జూపల్లి కృష్ణారావు పర్యటించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. గ్రామాల్లో అభివృద్ధి పనులను పరిశీలించి స్థానిక ప్రజలతో మాట్లాడారు. కల్వరాల గ్రామంలో మంచినీటి సరఫరాలో సమస్యలు ఉన్నాయని గ్రామస్థులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుం టామని మంత్రి హామీ ఇచ్చారు. గ్రామంలో తాగునీటి సౌకర్యం మెరుగుపరచడం అత్యవసరమని పేర్కొన్నారు. మంచినీటి పైప్‌లైన్ పనుల కోసం రూ.40 లక్షలు మంజూరు చేసినట్లు మంత్రి ప్రకటించారు. త్వరితగతిన పనులు ప్రారంభించి గ్రామ ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రజలకు మౌలిక వసతులు కల్పించడం ప్రాధాన్యతగా తీసుకుంటామని మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు

# పరీక్షల ఒత్తిడి విద్యార్థుల మానసిక ఆరోగ్యం నిశ్శబ్ద సంక్షోభమా?

- మార్కుల ఆధారిత వ్యవస్థ ప్రతిభను సరిగా కొలుస్తుందా?
- తల్లిదండ్రుల ఆశలు, సమాజ అంచనాలు పిల్లలపై మానసిక భారం
- పోటీ సంస్కృతి ఆత్మవిశ్వాసానికి ముప్పు
- పరిష్కారం అవగాహనలోనా? విద్యా సంస్కరణల్లోనా?

**వేద న్యూస్ డెస్క్:**



విద్యార్థి జీవితంలో పరీక్షలు ఒక భాగం మాత్రమే. కానీ ప్రస్తుతం అవి జీవితాన్ని నిర్ణయించే ప్రధాన ఘట్టాలుగా మారాయి. మార్కుల పోటీ, ర్యాంకుల ఒత్తిడి, భవిష్యత్తుపై భయం ఇవి కలిసి విద్యార్థుల మనసులపై తీవ్రమైన ఒత్తిడిని మోపుతున్నాయి. ఒక పరీక్ష ఫలితం మొత్తం వ్యక్తిత్వాన్ని నిర్వచించలేదని తెలిసినా, సమాజ నిర్మాణం మాత్రం అదే సందేశాన్ని ఇస్తోంది. ఇదే పరీక్షల ఒత్తిడిని నిశ్శబ్ద సంక్షోభంగా మారుస్తోంది.

మార్కుల ఆధారంగా ప్రతిభను కొలిచే విధానం విద్యా వ్యవస్థలో ప్రధాన ప్రమాణంగా మారింది. ఒక విద్యార్థి ఎంత శాతం సాధించాడో అనే ప్రశ్నకే ఎక్కువ ప్రాధాన్యం. కానీ ఆ విద్యార్థి ఆలోచనా శక్తి, సృజనాత్మకత, నైతిక విలువలు, నాయకత్వ లక్షణాలు వంటి అంశాలు పక్కన పడుతున్నాయి. పరీక్షలు జ్ఞానాన్ని అంచనా వేయడానికి ఒక మార్గం మాత్రమే. కానీ వాటిని ఏకైక ప్రమాణంగా భావించడం విద్యార్థులపై అనవసర ఒత్తిడిని పెంచుతోంది.

తల్లిదండ్రుల ఆశలు కూడా ఈ ఒత్తిడికి ఒక ప్రధాన కారణం. పిల్లలు విజయవంతం కావాలని కోరుకోవడం సహజం. కానీ ఆ ఆశలు అంచనాల భారంగా మారితే పిల్లలు మానసికంగా అలసిపోతారు. ప్రతి విద్యార్థి సామర్థ్యం వేరు. ఒకే ప్రమాణంతో అందరినీ కొలవడం న్యాయం కాదు. పిల్లల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలి; ఇతరులతో పోల్చి ఒత్తిడి పెంచకూడదు.

పోటీ సంస్కృతి కూడా ఈ పరిస్థితిని మరింత క్లిష్టం చేస్తోంది. ఒక ర్యాంకు కోసం వందలాది విద్యార్థులు పోటీ పడుతున్నారు. ఈ పోటీ వాతావరణంలో ఓటమి భయం పెరుగుతోంది. ఓటమి అంటే అంతమనే భావన పెరగడం ప్రమాదకరం. విజయం మాత్రమే జీవిత లక్ష్యమని భావించే సంస్కృతి విద్యార్థుల మానసిక స్థితిని దెబ్బతీస్తోంది. పరీక్షల ఒత్తిడి మానసిక ఆరోగ్యంపై తీవ్రమైన ప్రభావం చూపుతోంది. ఆందోళన, నిరాశ, నిద్రలేమి, ఆత్మవిశ్వాసం లోపం వంటి సమస్యలు పెరుగుతున్నాయి. కొన్నిసార్లు తీవ్రమైన నిర్ణయాలకు కూడా దారి తీస్తోంది. ఇది కేవలం వ్యక్తిగత సమస్య కాదు; సామాజిక బాధ్యత.

విద్యార్థుల మానసిక ఆరోగ్యాన్ని కాపాడటం కుటుంబం, విద్యాసంస్థలు, ప్రభుత్వం వర్గాల బాధ్యత. విద్యా వ్యవస్థలో సంస్కరణలు అవసరం. సమగ్ర అంచనా విధానం ఉండాలి. నైపుణ్యాలు, సృజనాత్మకత, క్రీడా ప్రతిభ, కళా సామర్థ్యాలకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలి. పాఠశాలల్లో కౌన్సెలింగ్ వ్యవస్థ బలపడాలి. మానసిక ఆరోగ్యంపై చర్చలు సాధారణంగా మారాలి. ఒత్తిడి తగ్గించే పద్ధతులు, సమయ నిర్వహణ, విశ్రాంతి పద్ధతులపై అవగాహన కల్పించాలి. తల్లిదండ్రులు పిల్లలతో మరింత సంభాషణ జరపాలి. ఫలితాలకంటే కృషిని ప్రశంసించాలి. ఓటమిని కూడా జీవితంలో ఒక పాఠంగా చూడాలి. విజయాన్ని మాత్రమే లక్ష్యంగా పెట్టి పిల్లలపై ఒత్తిడి పెంచడం సరైంది కాదు. పిల్లల ఆనందం, ఆరోగ్యం, ఆత్మవిశ్వాసం ముఖ్యమని గుర్తించాలి.

మొత్తంగా పరీక్షలు జీవితంలో ఒక దశ మాత్రమే. అవి భవిష్యత్తును నిర్ణయించే ఏకైక ప్రమాణం కావు. విద్యార్థుల మానసిక ఆరోగ్యం కాపాడితేనే సమాజ భవిష్యత్తు బలపడుతుంది. అవగాహన, సంభాషణ, విద్యా సంస్కరణలు కలిసి పనిచేస్తేనే పరీక్షల ఒత్తిడి తగ్గుతుంది. విద్యార్థి ఆనందంగా నేర్చుకుంటేనే నిజమైన విద్య సాధ్యమవుతుంది. అదే సమగ్ర అభివృద్ధికి మార్గం. తల్లిదండ్రుల ఆశలు కూడా ఈ ఒత్తిడికి కారణమవుతున్నాయి. పిల్లలు విజయవంతం కావాలనే ఆకాంక్ష సహజం. కానీ అది అంచనాల భారంగా మారితే సమస్యలు మొదలవుతాయి.

# కుటుంబ వ్యవస్థలో మార్పులు విలువలపై ప్రభావం

**వేద న్యూస్ డెస్క్:**

సమాజ నిర్మాణంలో కుటుంబం మూలస్తంభం. వ్యక్తి తొలి పాఠశాల కుటుంబమే. విలువలు, సంస్కారం, బాధ్యత, గౌరవం ఇవి కుటుంబంలోనే నేర్చుకుంటాం. ఒకప్పుడు సంయుక్త కుటుంబ వ్యవస్థలో తరం తరాల అనుబంధం బలంగా ఉండేది. పెద్దల అనుభవం, చిన్నవారి ఉత్సాహం కలసి జీవనానికి సమతుల్యతను ఇచ్చేవి. కానీ కాలానుగుణ మార్పులతో కుటుంబ వ్యవస్థ రూపం మారుతోంది. అణుకుటుంబాలు పెరుగుతున్నాయి. ఈ మార్పు విలువలపై ఎలా ప్రభావం చూపుతోందన్న ప్రశ్న సమాజంలో చర్చకు దారి తీస్తోంది. సంయుక్త కుటుంబాల్లో పరస్పర సహకారం సహజం. సమస్యలు సమిష్టిగా పరిష్కరించేవారు. బాధ్యతలు పంచుకునేవారు. పిల్లలు పెద్దలతో కలిసి పెరుగుతూ అనుభవాల ద్వారా విలువలను గ్రహించేవారు.

ఇప్పుడు అణుకుటుంబాల్లో స్వతంత్ర జీవనం పెరిగింది. ఇది వ్యక్తిగత స్వేచ్ఛకు దారి తీస్తున్నా, పెద్దల మార్గదర్శనం తగ్గుతున్నదన్న భావన ఉంది. ఆర్థిక స్వాతంత్ర్యం కుటుంబ నిర్మాణాన్ని ప్రభావితం చేసింది. ఉద్యోగాల కోసం వలసలు పెరిగాయి. యువత తమ స్వంత జీవితాన్ని నిర్మించుకోవాలనే దిశగా అడుగులు వేస్తోంది. ఇది స్వావలంబనకు సంకేతం. మహిళల ఆర్థిక స్వతంత్రత కుటుంబ నిర్ణయాల్లో సమానత్వాన్ని పెంచింది. కానీ అదే సమయంలో కుటుంబ అనుబంధాలు భౌతికంగా దూరమవుతున్నాయి.

ఒకే గృహంలో నివసించే సభ్యుల సంఖ్య తగ్గింది. తరం తరం మధ్య భావోద్వేగ దూరం కూడా పెరుగుతోందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. సాంకేతిక వనరులు పెరిగిన కొద్దీ ప్రత్యక్ష సంభాషణ తగ్గుతోంది. ఒకే ఇంట్లో ఉన్నా ప్రతి ఒక్కరూ తమ తమ ప్రపంచాల్లో మునిగిపోతున్నారు. విలువలు మాటల ద్వారా, అనుభవాల ద్వారా తరాల మధ్య ప్రయాణిస్తాయి. ఆ సంభాషణ తగ్గితే విలువల బలహీనతకు అవకాశం ఉంది. ఆధునిక జీవనశైలి వేగవంతమైంది. పనిభారం, పోటీ వాతావరణం, సమయాభావం ఇవి కుటుంబానికి కేటాయించే సమయాన్ని తగ్గిస్తున్నాయి. కలిసి భోజనం చేయడం, పండుగలను సమిష్టిగా జరుపుకోవడం, కుటుంబ సమావేశాలు నిర్వహించడం వంటి సంప్రదాయాలు తగ్గుముఖం పట్టాయి.

ఈ మార్పులు అనుబంధాలపై ప్రభావం చూపుతున్నాయి. అయితే మార్పును పూర్తిగా ప్రతికూలంగా చూడలేం. అణుకుటుంబాల వల్ల స్వతంత్ర ఆలోచన పెరిగింది. వ్యక్తిగత అభివృద్ధికి అవకాశాలు విస్తరించాయి. నిర్ణయాల్లో స్పష్టత పెరిగింది. మహిళలకు, యువతకు అవకాశాలు పెరిగాయి. ఇవన్నీ సానుకూల మార్పులే. కానీ ఈ పురోగతితో పాటు కుటుంబ విలువలను కాపాడుకోవడం అత్యవసరం. విలువలు కేవలం సంప్రదాయాల రూపంలో ఉండకూడదు. అవి జీవన విధానంలో ప్రతిఫలించాలి. పరస్పర గౌరవం, సహనం, బాధ్యత, అనుబంధం, పెద్దల పట్ల గౌరవం, చిన్నవారిపై ప్రేమ ఇవి కుటుంబంలోనే నేర్చుకునే పాఠాలు. సంభాషణకు ప్రాధాన్యం ఇవ్వాలి. వారాంతాల్లో కుటుంబ సమయాన్ని కేటాయించాలి. పండుగలు, సంస్కృతి, సంప్రదాయాల ద్వారా విలువలను తరాలకు అందించాలి. కుటుంబ వ్యవస్థలో మార్పులు సహజం. కానీ ఆ మార్పులు విలువలను దెబ్బతీయకుండా సమతుల్యంగా ముందుకు సాగాలి. ఆధునికతను అంగీకరించడంలో తప్పు లేదు. కానీ సంప్రదాయ విలువలను కోల్పోవడం ప్రమాదకరం. సమన్వయం అవసరం. ఆధునిక జీవనశైలిలో కూడా అనుబంధాలను కాపాడుకోవచ్చు.

ెుత్తంగా కుటుంబం బలంగా ఉంటేనే సమాజం బలపడుతుంది. విలువలు నిలబెడితేనే భవిష్యత్తు స్థిరంగా ఉంటుంది. కుటుంబ వ్యవస్థలో వచ్చిన మార్పులు అనివార్యమైనప్పటికీ, అనుబంధాలు, గౌరవం, బాధ్యత వంటి మూల విలువలను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత. ఆధునికత, సంప్రదాయం మధ్య సమతుల్యత సాధించినప్పుడే సమగ్ర సమాజ నిర్మాణం సాధ్యమవుతుంది.ఆధునిక జీవనశైలి వేగవంతమైంది. పనిభారం, సమయాభావం, పోటీ వాతావరణం ఇవి కుటుంబానికి కేటాయించే సమయాన్ని తగ్గిస్తున్నాయి.


# దృశ్యం మూడో భాగంపై సందిగ్ధం



**వేద న్యూస్ డెస్క్:**

తెలుగు ప్రేక్షకులను ఉత్కంఠకు గురి చేసిన దృశ్యం సిరీస్ మరోసారి చర్చనీయాంశమైంది. మొదటి రెండు భాగాల్లో రాంబాబు పాత్రలో మెప్పించిన వెంకటేష్ ఇప్పుడు మూడో భాగం విషయంలో కీలక నిర్ణయం తీసుకున్నారనే వార్తలు సినీ వర్గాల్లో వినిపిస్తున్నాయి. దృశ్యం, దృశ్యం 2 విజయాల తర్వాత ప్రేక్షకులంతా మూడో భాగాన్ని ఆసక్తిగా ఎదురుచూస్తున్న సమయంలో ఈ ప్రచారం మరింత ఉత్కంఠను పెంచుతోంది. మలయాళంలో మోహన్ లాల్ ప్రధాన పాత్రలో రూపొందుతున్న దృశ్యం 3 పనులు వేగంగా సాగుతున్నాయి. ఈ చిత్రాన్ని ఏప్రిల్ 2న విడుదల చేయాలని నిర్మాతలు భావిస్తున్నట్లు సమాచారం. ముఖ్యంగా ఈసారి చిత్రాన్ని కేవలం మలయాళానికి మాత్రమే పరిమితం చేయకుండా, తెలుగులోనూ అనువాద రూపంలోనే ఒకేసారి విడుదల చేయాలనే ఆలోచనలో ఉన్నారని తెలుస్తోంది. ఇటీవలి కాలంలో భాషా పరిమితులు తగ్గిపోవడంతో ఇతర భాషా చిత్రాలు కూడా తెలుగులో నేరుగా ఆదరణ పొందుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో అదే కథను మళ్లీ ప్రత్యేకంగా రూపొందించడం వ్యాపారపరంగా లాభదాయకం కాకపోవచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మలయాళ చిత్రం తెలుగులో నేరుగా విడుదలైతే ప్రేక్షకులు ఇప్పటికే కథను చూసే అవకాశం ఉండటంతో, మళ్లీ కొత్తగా నిర్మించడం సవాల్‌గా మారుతుందని విశ్లేషకులు అంటున్నారు. ఈ అంశాలన్నింటినీ పరిగణలోకి తీసుకుని వెంకటేష్ ఈ ప్రాజెక్ట్ నుంచి తప్పుకున్నారనే ప్రచారం జరుగుతోంది. అయితే దీనిపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. రాంబాబు పాత్రతో ప్రేక్షకుల హృదయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించిన వెంకటేష్ మూడో భాగంలో కనిపించకపోతే అభిమానులకు నిరాశ కలిగే అవకాశం ఉంది. అయినప్పటికీ మారుతున్న మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా తీసుకునే నిర్ణయాలు చిత్రసీమలో సహజమేనని సినీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఇప్పుడు అందరి దృష్టి మలయాళంలో తెరకెక్కుతున్న దృశ్యం మూడో భాగంపైనే నిలిచింది.


# అదిరిపోయే దుస్తుల్లో ఆలియా మెరిసింది



**వేద న్యూస్ డెస్క్:**

బాలీవుడ్ చిత్రసీమలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న నటి ఆలియా భట్ మరోసారి తన అందం, అభినయంతో పాటు శైలితో కూడా అభిమానులను మంత్ర ముగ్ధులను చేసింది. తక్కువ సమయంలోనే అగ్రనటిగా ఎదిగిన ఆమె, ప్రతి కార్యక్రమంలోనూ తన ప్రత్యేకమైన దుస్తుల ఎంపికతో అందరి దృష్టిని ఆకర్షిస్తుంటుంది. ఇటీవల జరిగిన ప్రతిష్ఠాత్మక బీఏఎఫ్టీఏ అవార్డ్స్ వేడుకలో ఆమె ధరించిన దుస్తులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఎర్ర తివాచీపై ఆమె అడుగుపెట్టగానే అక్కడి వాతావరణం ఒక్కసారిగా మెరిసిపోయిందని అభిమానులు వ్యాఖ్యానిస్తున్నారు. ఆలియా భట్ సినీ కుటుంబంలో జన్మించినప్పటికీ, తన ప్రతిభతోనే ఎదిగిన నటి. కథానాయికగా తన ప్రస్థానం ప్రారంభించిన కొద్ది కాలంలోనే వరుస విజయాలతో అగ్రస్థానాన్ని అందుకుంది. ఆమె నటించిన చిత్రాలు వాణిజ్యపరంగానే కాకుండా, విమర్శకుల ప్రశంసలు కూడా అందుకున్నాయి. పాత్రల ఎంపికలో జాగ్రత్తగా ముందుకు సాగుతూ, ప్రతి చిత్రంలో కొత్తదనం చూపించాలనే తపన ఆమెను ప్రత్యేకంగా నిలబెట్టింది. భావప్రకటనలోని సహజత్వం, సంభాషణలలోని నిగూఢత, పాత్రలో ఒదిగిపోవడంలో ఉన్న నైపుణ్యం ఆమెకు విస్తృతమైన అభిమాన వర్గాన్ని తీసుకొచ్చాయి. దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి రూపొందించిన ఆర్ఆర్ఆర్ చిత్రంలో సీత పాత్రలో కనిపించి ఆమె తెలుగు ప్రేక్షకులను కూడా ఆకట్టుకుంది. ఆ చిత్రంలో ఆమెకు ఎక్కువ దృశ్యాలు లేకపోయినా, తన సున్నితమైన నటనతో మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఆ తర్వాత తెలుగులో పెద్దగా అవకాశాలు రాకపోయినా, ఉత్తర భారత చిత్రసీమలో మాత్రం ఆమె వరుస విజయాలతో దూసుకెళ్తోంది. ఇటీవల జరిగిన అవార్డు వేడుకలో ఆలియా ధరించిన దుస్తులు సాంప్రదాయం, ఆధునికత కలయికగా నిలిచాయి. మృదువైన రంగులతో రూపొందించిన ఆ వస్త్రధారణ ఆమె అందాన్ని మరింత మెరుగు పరచింది. ఆభరణాల ఎంపిక కూడా సొగసైనది గా ఉండటంతో మొత్తం రూపానికి మరింత శోభ వచ్చింది. కార్యక్రమానికి హాజరైన పలువురు ప్రముఖులు ఆమె శైలిని ప్రశంసించారు. సామాజిక మాధ్యమాల్లో ఆమె చిత్రాలు విస్తృతంగా ప్రచారం పొందుతూ అభిమానుల ప్రశంసలు అందుకుంటున్నాయి. ప్రస్తుతం ఆలియా భట్ వరుస చిత్రాలతో బిజీగా గడుపుతోంది. విభిన్న కథాంశాలతో కూడిన చిత్రాలను ఎంచుకుంటూ, నటిగా తన పరిధిని విస్తరించుకుంటోంది. భవిష్యత్తులో మరిన్ని సవాల్‌భరిత పాత్రల్లో కనిపించి ప్రేక్షకులను మెప్పించేందుకు సిద్ధమవుతోంది. అందం మాత్రమే కాదు, అభినయం కూడా తన బలమని మరోసారి నిరూపించుకుంటూ ఆమె సినీ ప్రస్థానం విజయవంతంగా కొనసాగుతోంది.

# నాని 'ఆయాషేర్' దెబ్బకి పవన్ కళ్యాణ్ 'ఉస్తాద్' ఔరా గల్లంతు!




**వేద న్యూస్ డెస్క్:**

ప్రస్తుతం సోషల్ మీడియాలో నేచురల్ స్టార్ నాని 'ఆయాషేర్' మేనియా ప్రకంపనలు సృష్టిస్తోంది. నాని రాబోయే చిత్రం 'ది ప్యారడైజ్' నుంచి విడుద లైన ఈ స్పెషల్ సాంగ్ అటు టాలీవుడ్‌లోనే కాకుండా ఇటు డిజిటల్ ప్లాట్‌ఫారమ్స్‌లోనూ సంచలనంగా మారింది. ఈ పాటలో నాని చూపించిన మాస్ ఎనర్జీ, స్టెప్పులు, స్క్రీన్ ప్రెజెన్స్ ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టు కుంటున్నాయి. గతంలో నాని చేసిన పవర్‌ఫుల్ పాత్రల ప్రభావాన్ని కూడా ఈ పాట మించిపోయిందని నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు. మరోవైపు పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటిస్తున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రం నుంచి విడుదలైన 'ఔరా ఆఫ్ ఉస్తాద్' పాట మొదట ట్రెండింగ్‌లో నిలిచింది. అయితే నాని 'ఆయాషేర్' విడుదలైన తర్వాత సోషల్ మీడియా ట్రెండ్స్ పూర్తిగా మారిపో యాయి. విడుదలైన కొన్ని గంటల్లోనే 'ఆయాషేర్' పాట మ్యూజిక్ సెక్షన్‌లో టాప్ స్థానాన్ని కైవసం చేసుకోవడంతో 'ఉస్తాద్' పాట వెనక్కి వెళ్లింది. దీంతో "ఆయాషేర్ దెబ్బకి ఉస్తాద్ ఔరా గల్లంతయింది" అంటూ అభిమానులు సోషల్ మీడియాలో విస్తృతంగా కామెంట్లు చేస్తున్నారు.

# టాలీవుడ్ అవకాశాల కోసం ఎదురుచూస్తున్న ఇవానా



**వేద న్యూస్ డెస్క్:**

తాజా సంచలనంగా నిలిచిన నటి ఇవానా ఇప్పుడు తెలుగు చిత్రసీమలో అవకాశాల కోసం ఆసక్తిగా ఎదురు చూస్తోంది. బాలనటి గా తన ప్రస్థానం ప్రారంభించిన ఈ ముద్దు గుమ్మ, ఆ తర్వాత కథానాయిక గా మారి ప్రేక్షకులను ఆకట్టుకుంది. తమిళ చిత్రంగా విడుదలైన లవ్ టుడే ద్వారా ఆమెకు మంచి గుర్తింపు లభించింది. ఆ చిత్రం తెలుగులో అనువాద రూపంలో విడుదలై ఇక్కడ కూడా విశేష ఆదరణ పొందింది. లవ్ టుడే విజయానంతరం ఇవానా చేసిన మరో చిత్రం సింగిల్. ఇందులో హీరోగా నటించిన శ్రీవిష్ణుతో కలిసి ఆమె చూపించిన నటన ప్రేక్షకులను ఆకట్టుకుంది. అందం మాత్రమే కాకుండా భావప్రకటనలోనూ తన ప్రతిభను నిరూపించుకుంది. ఈ విజయాలతో ఇప్పుడు ఆమెకు తెలుగులో మరిన్ని అవకాశాలు వచ్చే సూచనలు కనిపిస్తున్నాయి. గతంలో ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఇవానా తన చిన్ననాటి అనుభవాలను పంచుకుంది. తాను ఎత్తు తక్కువగా ఉండటంతో పాఠశాల దశలో అనేక విమర్శలు ఎదుర్కొన్నానని, స్నేహితులు తనను 'పొట్టి' అంటూ ఆటపట్టించేవారని చెప్పింది. ఆ వ్యాఖ్యలు తనకు మానసికంగా బాధ కలిగించాయని, చదువుపై కూడా ప్రభావం చూపాయని వెల్లడించింది. అయితే చిన్న వయసు నుంచే సినిమాలపై ఆసక్తి ఉండేదని, అదే తనను ఈ రంగంలోకి తీసుకువచ్చిందని తెలిపింది. తెలుగులో తనకు ఎంతో ఇష్టమైన చిత్రం హ్యాపీడేస్ అని ఆమె చెప్పింది. ఆ చిత్రంలోని పాటలు తనకు ప్రత్యేకంగా నచ్చుతాయని పేర్కొంది. అలాగే తనకు అభిమాన నటుడిగా అల్లు అర్జున్ పేరు చెప్పింది. ప్రస్తుతం తమిళంతో పాటు తెలుగులోనూ వరుస అవకాశాలు అందుకుంటూ ముందుకు సాగుతున్న ఇవానా, సామాజిక మాధ్యమాల్లోనూ చురుకుగా ఉంటూ అభిమానులతో మమేకమవుతోంది. త్వరలోనే ఆమె టాలీవుడ్‌లో మరింత బిజీ కథానాయికగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# 10 ఏండ్ల నా కష్టానికి దక్కిన ప్రతిఫలం 'డంకీ' తాప్సీ

**వేద న్యూస్ డెస్క్:**

బాలీవుడ్ స్టార్ నటి తాప్సీ పన్నూ తన సినీ ప్రయాణం గురించి, అలాగే రాజ్‌కుమార్ హిరానీ దర్శకత్వంలో తెరకెక్కిన 'డంకీ' సినిమా తన కెరీర్‌లో ఎంత ముఖ్యమైనదో తాజాగా వెల్లడించింది. ఇటీవల ఆమె ప్రధాన పాత్రలో వచ్చిన 'అస్సీ' సినిమా ప్రమోషన్లలో పాల్గొన్న తాప్సీ మీడియాతో మాట్లాడుతూ.. 'డంకీ' తనకు పదేళ్ల పాటు చేసిన కష్టానికి దక్కిన అరుదైన ప్రతిఫలమని పేర్కొంది. పరిశ్రమలో ఎన్నో వైవిధ్యమైన పాత్రలు చేసినప్పటికీ, మెయిన్ స్ట్రీమ్ కమర్షియల్ సినిమాల్లో తనను పూర్తిస్థాయిలో అంగీకరించడానికి మేకర్స్ కొంత సమయం తీసుకున్నారని ఆమె అభిప్రాయపడింది. 'అస్సీ', 'తప్పడ్' వంటి కంటెంట్ ప్రధానమైన సినిమాల్లో నటించడం వల్లే తనకు 'డంకీ' లాంటి పెద్ద ప్రాజెక్ట్‌లో అవకాశం లభించిందని తాప్సీ చెప్పింది. ఆ చిత్రాల్లో తన నటనను గమనించిన దర్శకుడు రాజ్‌కుమార్ హిరానీ తనను ఎంపిక చేశారని తెలిపింది. కమర్షియల్ సినిమాలు మాత్రమే కాకుండా కథా బలమున్న పాత్రలను ఎంచుకోవడమే తన ప్రయాణంలో ముఖ్యమైందని, అలాంటి నిర్ణయాలే తనను ఈ స్థాయికి తీసుకొచ్చాయని ఆమె స్పష్టం చేసింది. తన కెరీర్‌లో ఎదురైన ఒడిదుడుకులు, విమర్శలు అన్నింటినీ ఎదుర్కొంటూ ముందుకు సాగానని, ఇప్పుడు లభిస్తున్న అవకాశాలు తనపై తనకున్న నమ్మకానికి నిదర్శనమని తాప్సీ పేర్కొంది. భవిష్యత్తులో కూడా వినూత్నమైన పాత్రలు చేస్తూ ప్రేక్షకులను అలరించాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తానని ఆమె తెలిపింది.



# ఉదయ్‌పూర్‌లో విజయ్‌రష్మికల వివాహం

**వేద న్యూస్ డెస్క్:**

టాలీవుడ్‌లో అత్యంత ఆదరణ పొందిన జంటగా గుర్తింపు పొందిన విజయ్ దేవరకొండ, రష్మిక మందన్నలు మరికొద్ది గంటల్లో వివాహ బంధంతో ఒక్కటవబోతున్నారు. ఎన్నేళ్లుగా ప్రేమలో ఉన్న ఈ జంట తమ సంబంధాన్ని అధికారికంగా వెల్లడించిన తర్వాత అభిమానుల్లో ఉత్సాహం మరింత పెరిగింది. ఇప్పుడు రాజస్థాన్ రాష్ట్రంలోని అందమైన సరస్సుల నగరం ఉదయ్‌పూర్లో అంగరంగ వైభవంగా ఈ వివాహ వేడుక జరగనుండటం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. పరిమిత అతిథుల సమక్షంలో అత్యంత గోప్యంగా ఈ వేడుకను నిర్వహిస్తున్నట్లు సమాచారం. సుమారు వందమంది సన్నిహితులు, కుటుంబ సభ్యులు మాత్రమే ఈ కార్యక్రమానికి హాజరవుతున్నారని తెలుస్తోంది. ఫిబ్రవరి 26న జరగనున్న ఈ వివాహం రెండు భిన్న సంప్రదాయాల ప్రకారం నిర్వహించనున్నారు. విజయ్ దేవరకొండ తెలుగు కుటుంబానికి చెందినవారు కాగా, రష్మిక మందన్న కర్ణాటక రాష్ట్రంలోని కొడగు జిల్లాకు చెందిన కొడవ సమాజానికి చెందారు. అందుకే ఉదయం తెలుగు సంప్రదాయం ప్రకారం, సాయంత్రం కొడవ ఆచారాల ప్రకారం వివాహ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. కొడవ సమాజానికి ప్రత్యేకమైన సంస్కృతి, ఆచార వ్యవహారాలు ఉన్నాయి. వీరి వివాహాన్ని "మంగళ" అని పిలుస్తారు. సాధారణ హిందూ వివాహాల్లో ఉండే అగ్నిప్రదక్షిణలు, సప్తపది వంటి ఆచారాలు ఉండవు. ఆయుధాలకు ప్రత్యేక పూజలు చేయడం, వరుడు కత్తి ధరించి ఊరేగింపుగా రావడం, అరటి మొక్కలను నరికే ఆచారం ఈ సంస్కృతిలో ప్రత్యేకతగా నిలుస్తాయి. పెళ్లి రోజు వధువు సంప్రదాయబద్ధంగా ప్రత్యేక శైలిలో చీర కట్టుకుంటారు. వరుడు నలుపు రంగు కోటు, తలపాగా ధరించడం ఆనవాయితీగా ఉంటుంది. పూర్వీకులకు, ప్రకృతికి, కావేరి మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించడం కొడవ సంప్రదాయంలో ముఖ్యమైన భాగంగా భావిస్తారు. ఈ రెండు సంప్రదాయాల సమ్మిళితంగా జరిగే వివాహం అరుదైన వేడుకగా నిలవనుంది. వివాహానంతరం మార్చి 4న హైదరాబాద్ నగరంలో ప్రముఖ అతిథుల కోసం ప్రత్యేక విందు ఏర్పాటు .హాజరుకానున్నారని తెలుస్తోంది. ఎన్నాళ్లుగానో తమ ప్రేమను గోప్యంగా కొనసాగించిన ఈ జంట ఇప్పుడు దంపతులుగా కొత్త జీవితాన్ని ప్రారంభించబోతుండటంతో అభిమానులు ఆనందంలో మునిగిపోయారు. దేశవ్యాప్తంగా ఈ వివాహ వేడుకపై ఆసక్తి నెలకొంది.





వేద న్యూస్

గురువారం ఫిబ్రవరి 26, 2026

# ర్యాంకింగ్స్‌లో భారత ఆటగాళ్ల సత్తా

**వేద న్యూస్ డెస్క్:**




అంతర్జాతీయ క్రికెట్ మండలి విడుదల చేసిన తాజా పురుషుల ఇరవై ఓవర్ల ఆటగాళ్ల ర్యాంకింగ్స్‌లో భారత ఆటగాళ్లు ఆధిపత్యం చాటారు. బ్యాటింగ్ విభాగంలో అభిషేక్ శర్మ అగ్రస్థానాన్ని నిలబెట్టుకోగా, వికెట్ కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్ మూడు స్థానాలు ఎగబాకి తొలి ఐదు స్థానాల్లోకి ప్రవేశించాడు. ప్రపంచ కప్ పోటీల్లో పెద్దగా మెరుపులు చూపకపోయినా, గత ప్రదర్శనల ఆధారంగా అభిషేక్ తన స్థిరత్వాన్ని కొనసాగించడం విశేషంగా నిలిచింది. అభిషేక్ శర్మకు రెండో స్థానంలో ఉన్న ఇంగ్లండ్ ఆటగాడు ఫిల్ సాల్ట్కు గణనీయమైన ఆధిక్యం కొనసాగుతోంది. ఇదే జాబితాలో పాకిస్థాన్ ఓపెనర్ సాహిబ్జాదా ఫర్హాన్ రెండు స్థానాలు మెరుగుపరుచుకుని మూడో స్థానానికి చేరడం గమనార్హం. ఇషాన్ కిషన్ స్థిరమైన ప్రదర్శనతో ఐదో ర్యాంకును అందుకోవడం భారత అభిమానుల్లో ఆనందం నింపుతోంది. ఆల్‌రౌండర్ల జాబితాలో సికందర్ రజా మళ్లీ అగ్రస్థానాన్ని కైవసం చేసుకున్నాడు. జింబాబ్వే జట్టుకు కెప్టెన్‌గా సేవలందిస్తున్న రజా, బ్యాటింగ్ మరియు బౌలింగ్‌లో సమతుల్య ప్రదర్శనతో ఈ స్థాయిని అందుకున్నాడు. భారత ఆల్‌రౌండర్ శివమ్ దూబే రెండు స్థానాలు మెరుగుపరుచుకుని ఏడో స్థానానికి చేరడం మరో శుభవార్తగా నిలిచింది. బౌలింగ్ విభాగంలోనూ భారత ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి తన అగ్రస్థానాన్ని నిలబెట్టుకున్నాడు. వేగవంతమైన బౌలర్ జస్ప్రీత్ బుమ్రా ర్యాంకును మెరుగుపరుచుకుని ఎనిమిదో స్థానానికి చేరాడు. మరోవైపు దక్షిణాఫ్రికా పేసర్ కార్బిన్ బాష్ ఏకంగా ఇరవై ఒక స్థానాలు ఎగబాకి మూడో స్థానంలో నిలవడం విశేషం. ఇలా తాజా ర్యాంకింగ్స్‌లో భారత ఆటగాళ్లు పలు విభాగాల్లో మెరుగైన స్థానాలు దక్కించుకోవడం జట్టుకు ఉత్సాహాన్నిస్తోంది. ప్రపంచ కప్ పోటీల్లో ఈ ర్యాంకుల ప్రతిఫలం ఎలా ఉంటుందో చూడాలి. అభిమానులు తమ ఆటగాళ్లు ఇదే జోరు కొనసాగించాలని ఆకాంక్షిస్తున్నారు.

# రింకూ సింగ్ తిరిగి జట్టులోకి




**వేద న్యూస్ డెస్క్:**

సూపర్ ఎనిమిది దశలో కీలక పోరుకు సిద్ధమవుతున్న భారత జట్టుకు ఊరటనిచ్చే వార్త అందింది. తండ్రి అనారోగ్య కారణంగా శిక్షణ శిబిరాన్ని విడిచి వెళ్లిన స్టార్ బ్యాటర్ రింకూ సింగ్ తిరిగి జట్టుతో కలవనున్నట్లు సమాచారం. జింబాబ్వేతో జరగనున్న మ్యాచ్‌కు ముందు అతను అందుబాటులో ఉంటాడని భారత జట్టు బ్యాటింగ్ శిక్షకుడు సితాన్షు కొటక్ స్పష్టం చేశారు. ఐసీసీ టీ20 ప్రపంచ కప్ 2026లో భాగంగా చెన్నైలో జరుగుతున్న శిబిరం నుంచి రింకూ సింగ్ తండ్రి ఆరోగ్యం క్షీణించడంతో స్వగ్రామానికి బయలుదేరిన విషయం తెలిసిందే. ఆయన తండ్రి తీవ్రమైన కాలేయ వ్యాధితో బాధపడుతున్నారని, ప్రస్తుతం వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొందుతున్నారని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఇలాంటి క్లిష్ట సమయంలో కుటుంబ సభ్యులతో ఉండేందుకు రింకూ తాత్కాలికంగా జట్టును వీడినట్లు అప్పట్లో వెల్లడించారు. అయితే జింబాబ్వేతో జరిగే కీలక పోరుకు ముందు రింకూ మళ్లీ జట్టుతో చేరనున్నాడన్న సమాచారం ఆటగాళ్లలో ఉత్సాహం నింపుతోంది. సూపర్ ఎనిమిది దశలో తొలి ఓటమి తర్వాత ప్రతి మ్యాచ్ భారత్‌కు అత్యంత ప్రాధాన్యంగా మారింది. ఈ నేపథ్యంలో మధ్యవరుసలో రింకూ వంటి ముగింపు నిపుణుడు అందుబాటులో ఉండడం జట్టుకు బలాన్నిస్తుంది. బ్యాటింగ్ శిక్షకుడు సితాన్షు కొటక్ మాట్లాడుతూ రింకూ తండ్రి ఆరోగ్య పరిస్థితి స్థిరంగా ఉందని, అతను సాయంత్రానికే జట్టుతో చేరతాడని ఆశిస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకు జరిగిన అన్ని మ్యాచ్‌లలోనూ రింకూ జట్టులో భాగంగా ఉన్నాడు. ఒత్తిడి పరిస్థితుల్లో చక్కటి ప్రదర్శన చేయగల సామర్థ్యం అతనికి ఉందని జట్టు యాజమాన్యం భావిస్తోంది. జింబాబ్వేతో జరిగే ఈ పోరు భారత్‌కు అత్యంత కీలకం. సెమీఫైనల్ ఆశలు నిలుపుకోవాలంటే విజయం తప్పనిసరి. ఇలాంటి సమయంలో రింకూ సింగ్ తిరిగి రావడం అభిమానుల్లో ఆనందం నింపుతోంది. జట్టు సమతుల్యతను కాపాడుకుంటూ విజయపథంలోకి తిరిగి రావాలని అభిమానులు ఆకాంక్షిస్తున్నారు.

# రంజీ ట్రోఫీ ఫైనల్‌లో జమ్మూ కశ్మీర్ ఆధిపత్యం

**వేద న్యూస్ డెస్క్**



దేశీయ క్రికెట్‌లో ప్రతిష్ఠాత్మకమైన రంజీ ట్రోఫీ ఫైనల్ పోరులో కర్ణాటక క్రికెట్ జట్టు మరియు జమ్మూ కశ్మీర్ క్రికెట్ జట్టు జట్లు తల పడుతున్నాయి. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్ చేపట్టిన జమ్మూ కశ్మీర్ జట్టు రెండో రోజు ముగిసే సరికి ఆరు వికెట్ల నష్టానికి 527 పరుగులు చేసి బలమైన స్థితిలో నిలిచింది. కర్ణాటక బౌలర్లు ఎంత శ్రమించినా ప్రత్యర్థి బ్యాటర్లను పూర్తిగా కట్టడి చేయలేకపోయారు. మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 117 పరుగులతో అజేయంగా ఉన్న శుభమ్ పుందిర్ రెండో రోజు నాలుగు పరుగులు మాత్రమే జోడించి 121 పరుగుల వద్ద ఔటయ్యాడు. మొత్తం మ్యాచ్‌లో ఇప్పటివరకు ఒక శతకం, ఐదు అర్ధ శతకాలు నమోదవడం విశేషం. జమ్మూ కశ్మీర్ బ్యాటర్లు క్రమంగా భాగస్వామ్యాలు నెలకొల్పుతూ భారీ స్కోరు దిశగా పయనించారు. ఓవర్‌నైట్ స్కోరు 284 పరుగులకు రెండు వికెట్లు ఉన్న స్థితి నుంచి రెండో రోజు ప్రారంభించిన జమ్మూ కశ్మీర్ ఆరంభంలో రెండు వికెట్లు కోల్పోయినా, కెప్టెన్ పరాస్ డోగ్రా తిరిగి క్రీజులోకి వచ్చి స్థిరమైన ఇన్నింగ్స్ ఆడాడు. కన్హయ్య వాధవాన్‌తో కలిసి 110 పరుగుల కీలక భాగస్వామ్యాన్ని నెలకొల్పి జట్టును బలమైన స్థితిలోకి తీసుకెళ్లాడు. ప్రస్తుతం సాహిల్ లోత్రా అజేయంగా 57 పరుగులు, అబిద్ ముస్తాక్ 20 పరుగులతో క్రీజులో కొనసాగుతున్నారు. కర్ణాటక బౌలర్లలో ప్రసిద్ధ్ కృష్ణ మూడు వికెట్లు పడగొట్టగా, విద్యాధర్ పాటిల్, శ్రేయాస్ గోపాల్, శిఖర్ శెట్టి తలో వికెట్ తీశారు. మూడో రోజు ఆటలో కర్ణాటక త్వరగా మిగతా వికెట్లు తీసి జమ్మూ కశ్మీర్‌ను పరిమిత స్కోరుకే ఆపాలనే లక్ష్యంతో బరిలోకి దిగనుంది. మరోవైపు జమ్మూ కశ్మీర్ భారీ స్కోరు సాధించి ప్రత్యర్థిపై ఒత్తిడి తీసుకురావాలనే దిశగా ముందుకెళ్తోంది.

# హాకీ గోల్ కీపర్‌కు అత్యున్నత పురస్కారం




**వేద న్యూస్ డెస్క్:**

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ దేశ అత్యున్నత పౌర పురస్కారాన్ని హాకీ క్రీడాకారుడికి ప్రదానం చేయనున్నట్లు ప్రకటించారు. మిలాన్ కోర్టినా నగరాల్లో జరిగిన శీతకాల ఒలింపిక్స్ పోటీల పురుషుల హాకీ విభాగంలో అమెరికాకు స్వర్ణ పతకం అందించిన గోల్ కీపర్ కొన్నార్ హెల్లిబక్ కు అధ్యక్ష స్వేచ్ఛా పతకాన్ని అందజేయనున్నట్లు ఆయన ఉభయ సభలను ఉద్దేశించి చేసిన ప్రసంగంలో వెల్లడించారు. ఈ ప్రకటనతో క్రీడా ప్రపంచంలో ఆనంద వాతావరణం నెలకొంది.

మిలాన్ కోర్టినా శీతకాల ఒలింపిక్స్ లో జరిగిన తుది పోరులో అమెరికా జట్టు చిరకాల ప్రత్యర్థి కెనడా జాతీయ ఐస్ హాకీ జట్టు ను ఎదుర్కొంది. ఉత్కంఠభరితంగా సాగిన ఈ పోరులో గోల్ కీపర్‌గా కొన్నార్ హెల్లిబక్ అసాధారణ ప్రతిభ కనబరిచాడు. ప్రత్యర్థి జట్టు చేసిన నలభై ఒక గోల్ ప్రయత్నాలను అడ్డుకొని తన జట్టును రక్షించాడు. మ్యాచ్ సమంగా నిలిచిన కీలక దశలో ఆయన చేసిన అద్భుత రక్షణలు విజయంలో ప్రధాన పాత్ర పోషించాయి.

మ్యాచ్ చివరి నిమిషాల్లో అమెరికా ఆటగాడు జాక్ హ్యూజ్స్ చేసిన గోల్‌తో అమెరికా ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. రెండోర్థంలో హెల్లిబక్ తన స్టిక్‌తో అడ్డుకున్న గోల్ ప్రయత్నం పోరుకు మలుపు తిప్పిన ఘట్టంగా నిలిచింది. ఆ గోల్ నమోదై ఉంటే ఫలితం మారిపోయేదని విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు. ఎన్నో సంవ త్సరాల తర్వాత ఐస్ హాకీ విభాగం లో అమెరికా స్వర్ణ పత కాన్ని సాధించడంతో దేశవ్యాప్తంగా సంబరాలు కొనసాగుతున్నాయి.

# అతిగా ఆలోచించొద్దన్న పాంటింగ్

**వేద న్యూస్ డెస్క్:**



దక్షిణాఫ్రికాతో జరిగిన సూపర్ ఎనిమిది పోరులో ఘోర పరాజయం అనంతరం భారత జట్టుకు ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్ కీలక సూచనలు చేశారు. జట్టు ఎంపిక విషయంలో అతిగా వ్యూహాలు రచించడం మానేసి, అత్యుత్తమ పదకొండు మందిని మాత్రమే బరిలోకి దింపాలని ఆయన హితవు పలికారు. ప్రత్యర్థి జట్టులో ఎడమచేతి బ్యాటర్లు ఎక్కువగా ఉన్నారనే కారణంతో తుది జట్టులో మార్పులు చేయడం సరైన దారి కాదని అభిప్రాయపడ్డారు. ఐసీసీ టీ20 ప్రపంచ కప్ 2026లో భాగంగా జరిగిన ఈ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా జాతీయ క్రికెట్ జట్టు భారీ స్కోరు నమోదు చేయగా, ఛేదనలో భారత జాతీయ క్రికెట్ జట్టు తక్కువ పరుగులకే కుప్పకూలింది.

# విమర్శలతో కప్ రాదన్న సల్మాన్ అఘా



**వేద న్యూస్ డెస్క్:**

నన్ను లేదా నా కుమారుడిని అసభ్యపదజాలంతో దూషించినంత మాత్రాన దేశానికి కప్ రాదని పాకిస్థాన్ జట్టు కెప్టెన్ సల్మాన్ అఘా భావోద్వేగంగా స్పందించాడు. సూపర్ ఎనిమిది దశలో ఇంగ్లాండ్ జాతీయ క్రికెట్ జట్టు చేతిలో పాకిస్థాన్ ఓటమి పాలవడంతో అభిమానుల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. జట్టు ఆటతీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్న వేళ, సల్మాన్ అఘాతో పాటు అతని కుటుంబాన్ని కూడా లక్ష్యంగా చేసుకుని దూషణలు జరుగుతున్నాయి. ఐసీసీ టీ20 ప్రపంచ కప్ 2026లో పాకిస్థాన్ పరిస్థితి సంక్లిష్టంగా మారింది. ఒక మ్యాచ్‌లో పరాజయం, మరో మ్యాచ్ వర్షం కారణంగా రద్దు కావడంతో జట్టు ఖాతాలో కేవలం ఒక పాయింట్ మాత్రమే ఉంది. ఇదే సమయంలో న్యూజిలాండ్ జాతీయ క్రికెట్ జట్టుకూ ఒక పాయింట్ ఉండడం పోటీని మరింత ఉత్కంఠభరితంగా మార్చింది. కొలంబో వేదికగా శ్రీలంక జాతీయ క్రికెట్ జట్టుతో న్యూజిలాండ్ ఆడబోయే మ్యాచ్ ఫలితం పాకిస్థాన్ భవితవ్యాన్ని ప్రభావితం చేయనుంది. ఇంగ్లాండ్‌పై జరిగిన మ్యాచ్‌లో సల్మాన్ అఘా బ్యాటింగ్‌లో విఫలమయ్యాడు. దీంతో అభిమానులు తీవ్ర నిరాశ వ్యక్తం చేస్తున్నారు. అయితే కుటుంబ సభ్యులను లక్ష్యంగా చేసుకుని విమర్శించడం సరైంది కాదని సల్మాన్ అఘా స్పష్టం చేశాడు. ఆటలో ఓటమి సహజమని, కానీ వ్యక్తిగత దూషణలు జట్టుకు ఉపయోగం చేయవని పేర్కొన్నాడు. క్రీడాస్ఫూర్తిని కాపాడాలని, జట్టుకు మద్దతు ఇవ్వాలని అభిమానులను కోరాడు. ప్రస్తుతం సమీకరణాలు క్లిష్టంగా ఉన్నాయి. న్యూజిలాండ్ శ్రీలంకపై గెలిస్తే పాకిస్థాన్ అవకాశాలు దాదాపు ముగిసినట్టే. ఒకవేళ శ్రీలంక విజయం సాధిస్తే తదుపరి మ్యాచ్‌లు కీలకంగా మారనున్నాయి. నెట్ పరుగుల సగటు కూడా నిర్ణయాత్మక పాత్ర పోషించే అవకాశం ఉంది. చివరి మ్యాచ్‌లో పాకిస్థాన్ శ్రీలంకను ఎదుర్కోనుంది. ఆ మ్యాచ్ ఫలితమే కాకుండా ఇతర జట్ల ఫలితాలపై కూడా వారి సెమీఫైనల్ అవకాశాలు ఆధారపడి ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో విమర్శల కంటే మద్దతే జట్టుకు అవసరమని సల్మాన్ అఘా పేర్కొనడం గమనార్హం. క్రీడలో విజయాలు, పరాజయాలు సహజమని, కానీ జట్టును ముందుకు నడిపించేది అభిమానుల విశ్వాసమేనని ఆయన సందేశం స్పష్టం చేస్తోంది.

# అఫ్గనిస్తాన్‌కు కొత్త హెడ్ కోచ్ రిచర్డ్ పైబస్

**వేద న్యూస్ డెస్క్:**




అఫ్గనిస్తాన్ జాతీయ క్రికెట్ జట్టు సరికొత్త దిశగా అడుగులు వేస్తోంది. జట్టు నూతన ప్రధాన శిక్షకుడిగా ఇంగ్లండ్‌కు చెందిన అనుభవజ్ఞుడు రిచర్డ్ పైబస్ను నియమించినట్లు అఫ్గనిస్తాన్ క్రికెట్ బోర్డు ప్రకటించింది. ఇరవై ఓవర్ల ప్రపంచ కప్ 2026 వరకు బాధ్యతలు నిర్వర్తించిన జొనాథన్ ట్రాట్ పదవీకాలం ముగియడంతో ఆయన స్థానంలో పైబస్ బాధ్యతలు స్వీకరించనున్నారు. వచ్చే నెలలో శ్రీలంక జాతీయ క్రికెట్ జట్టుతో జరగనున్న పరిమిత ఓవర్ల సిరీస్‌తో పైబస్ తన శకాన్ని ప్రారంభించనున్నాడు. ఇటీవలి కాలంలో అఫ్గనిస్తాన్ జట్టు అంతర్జాతీయ వేదికపై మెరుగైన ప్రదర్శనలు చేస్తూ గుర్తింపు పొందుతున్న తరుణంలో ఈ నియామకం మరింత బలం చేకూర్చుతుందని బోర్డు విశ్వాసం వ్యక్తం చేసింది. ఆటగాళ్లలో క్రమశిక్షణ పెంపొందించడం, వ్యూహాలను సమర్థంగా అమలు చేయించడం విషయంలో పైబస్‌కు మంచి పేరు ఉంది. ఆటగాడిగా పెద్దగా ప్రాచుర్యం పొందకపోయినా, శిక్షకుడిగా ఆయనకు విశేష అనుభవం ఉంది. 2013 నుంచి 2019 వరకు వెస్టిండీస్ జాతీయ క్రికెట్ జట్టు ప్రధాన శిక్షకుడిగా పనిచేశారు. అదే సమయంలో కరీబియన్ జట్లు పురుషుల, మహిళల, పద్దెనిమిదేళ్లలోపు ప్రపంచ కప్‌లను సాధించడంలో కీలక పాత్ర పోషించారు. జట్టు నిర్మాణంలో దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొందించడం ఆయన ప్రత్యేకతగా గుర్తింపు పొందింది. ఇరవై ఓవర్ల ప్రపంచ కప్ 2026లో అఫ్గనిస్తాన్ ఆశించిన స్థాయిలో రాణించలేకపోయింది. గ్రూప్ దశలో దక్షిణాఫ్రికా జాతీయ క్రికెట్ జట్టు, న్యూజిలాండ్ జాతీయ క్రికెట్ జట్టు, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ జాతీయ క్రికెట్ జట్టు, కెనడా జాతీయ క్రికెట్ జట్టు జట్లతో పోటీపడి రెండు మ్యాచ్‌ల్లో మాత్రమే విజయం సాధించింది. తద్వారా సూపర్ ఎనిమిది దశకు చేరకుండానే నిష్క్రమించింది. అయితే గత సంచికలో అనూహ్యంగా సెమీఫైనల్ దశ చేరడం అఫ్గన్ జట్టు సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటింది. ఇప్పుడు రిచర్డ్ పైబస్ నియామకంతో జట్టులో కొత్త ఉత్సాహం కనిపిస్తోంది. యువ ఆటగాళ్లను తీర్చిదిద్దుతూ, అనుభవజ్ఞుల సామర్థ్యాన్ని సమర్థంగా వినియోగించగలిగితే అఫ్గనిస్తాన్ మళ్లీ అంతర్జాతీయ వేదికపై సంచలనాలు సృష్టించే అవకాశాలు ఉన్నాయి. అభిమానులు కూడా కొత్త ప్రధాన శిక్షకుడి మార్గదర్శకత్వంలో జట్టు మరింత ఎత్తులకు చేరాలని ఆశిస్తున్నారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073